

కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అడ్డుకోవడమే లక్ష్యంగా వైసీపీ రాజకీయ కుట్రలు చేస్తోంది. రాష్ట్ర ప్రజలు చైతన్యవంతులు. వైసీపీ అబద్ధాల ప్రచారాన్ని, విభజన రాజకీయాలను ప్రజలు ఎన్నటికీ నమ్మరని స్పష్టం చేశారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 19.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 58 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# పేదలకు చేరేలా పారిశ్రామిక ఫలాలు

- రూ.30,515 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- 29,677 ఉద్యోగాల సృష్టికి మార్గం
- స్టార్టప్‌లు, సెమీకండక్టర్లు, ఇథనాల్ పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహం

**అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్)** :పారిశ్రామికాభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఏపీలో ఏర్పాటయ్యే పారిశ్రామిక ఎకో సిస్టంను రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమలు, కంపెనీలను ధనికులే స్థాపించగలరనే భావన పోయేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో 18వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ కంపెనీల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. మొత్తంగా 50 కంపెనీలకు సంబంధించి రూ. 30,515 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ కంపెనీల ద్వారా మొత్తంగా 29677 ఉద్యోగాలు రానున్నాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతి ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలి. పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా పేద, మధ్య తరగతి వారికి ఉద్యోగాలు కల్పించడమే కాదు... సామాన్యులు కూడా కంపెనీలు స్థాపించే అవకాశం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు స్టార్టప్ కంపెనీలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ సేవలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలి. ఆర్టీఐహెచ్ పరిధిలోని స్టార్టప్ కంపెనీలకు వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు వచ్చేలా చూడాలి. ఈ విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి. దీనికి అనుగుణంగా ఎకో సిస్టం ఏర్పాటు చేసే అంశంపై అధికారులు ఫోకస్ పెట్టాలి. ఇక వచ్చే పరిశ్రమలకు అనుగుణంగా కరిక్యులమ్ తయారు చేసే దిశగా విద్యా శాఖ ఆలోచన చేయాలి. పరిశ్రమలు, ప్రాజెక్టుల్లో ఎలాంటి ట్రెండ్స్ వస్తున్నాయో గమనించి దానికి అనుగుణంగా కరిక్యులమ్ రూపొందించాలి. రోబోటిక్స్ లాంటి ఆధునిక టెక్నాలజీ కోర్సులు కూడా మన విద్యా సంస్థల్లో ఉండాలి. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి నాన్ సీరియస్ ప్లేయర్స్ కు ఏపీలో చోటు లేదు. ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాక... వెంటనే పనులు మొదలు పెట్టేలా చూడాలి. పనులు ప్రారంభించని సంస్థలతో టచ్ లో ఉంటూ ఫాలో అప్ చేయాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

**ఆటోమేషన్ లో పారిశ్రామిక అనుమతులు** : "ఇథనాల్ తయారీ విషయంలో ముందడుగు వేయాలి. 40 శాతం ఇథనాల్ బ్లెండ్ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సాహిస్తే... రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఇథనాల్ బేస్డ్ ఇంధనం ఎక్కువగా ఉపయోగిస్తే దిగుమతి చేసుకునే ఇంధన భారం తగ్గుతుంది. బయో ఫ్యూయల్స్ రంగాన్ని మరింత ప్రోత్సహించాల్సి ఉంది. ఈ విషయంపై ఆయిల్ కంపెనీలతో సంప్రదింపులు జరపాలి. అలాగే వివిధ రంగాల్లో ప్రాజెక్టులు తీసుకురావడంతో పాటు.. విద్యుత్ సరఫరా అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా ప్రాజెక్టులు వచ్చేలా చూడాలి. ఈ ఏడాది డిమాండ్ లో 17 శాతం వృద్ధి నమోదైంది. ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య విభాగాల వినియోగానికి అనుగుణంగా విద్యుత్ ఎంత అవసరం అవుతుందో అంచనాలు తయారు చేయాలి. సోలార్ విండ్, పంప్డ్ స్టోరేజితో పాటు దీజులా టెక్నాలజీకే ఇక భవిష్యత్తు. 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీకి అనుగుణంగా పంప్డ్ స్టోరేజి సహా ఇతర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులు చేపట్టాలి. లీథియం అయాన్ బ్యాటరీల ఉత్పత్తిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఈవీలకు ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీలపై దృష్టి పెట్టాలి. బ్యాటరీ టెక్నాలజీపై ఎక్కువ దృష్టి పెట్టండి. డేటా సెంటర్ల ఏర్పాటు విషయంలో విద్యుత్ వినియోగం అనేది అత్యంత కీలకం.

మిగతా 2లో...

## ఆక్వా రైతులకు ఊరట

- ఫీడ్ ధర కేజీకి రూ.4 తగ్గింపు
- రైతులు-తయారీదారులతో సీఎం చంద్రబాబు కీలక సమావేశం
- ధరల స్థిరీకరణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

2 లో

## పొగాకు రైతుకు అండగా ప్రభుత్వం

- కేజీ రూ.200 కంటే తగ్గొద్దన్న సీఎం
- ధరల స్థిరీకరణకు కేంద్రంతో చర్చలు

2 లో

మరిన్ని కథనాలు లోపలి పేజీల్లో

## ఎంపీ టార్చర్‌పై హైకోర్టు సీరియస్




- రఘురామ కేసులో కీలక వ్యాఖ్యలు
- కస్టోడియల్ టార్చర్ తీవ్ర అంశమన్న ధర్మాసనం

## డ్రగ్స్‌పై డేగ కన్ను



- 'ఈగల్' వ్యవస్థతో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ
- 20,876 కేజీల గంజాయి, 23 కేజీల హాష్ ఆయిల్ ధ్వంసం
- యువతను మత్తు బారి నుంచి కాపాడటమే లక్ష్యం: హోంమంత్రి అనిత

## పొగాకు రైతుల ప్రయోజనాలే లక్ష్యం



**అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్)** : పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయ స్వామి,

## విషం విక్రయించే దందాకు అడ్డుకట్ట వేశాం





**గుంటూరు (జర్నలిస్ట్‌ఫైల్)** : సుపరిపాలన ద్వారా సమాజంలో మార్పు తీసుకువస్తూ భావితరాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని కొనసాగించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గుంటూరు నగరంలోని శ్రీ సత్యసాయి గ్రౌండ్స్‌లో సుపరిపాలన విజయోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ, రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.


మిగతా 2లో...

- గుంతల రోడ్లకు గుడ్ బై చెప్పాం
- ప్రభుత్వ సేవలు పొందడం ప్రజల హక్కుగా మార్చాం
- కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



## పీఎంశ్రీ అమల్లో దేశానికే ఆదర్శం ఏపీ

- పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలోనే తొలి స్థానం
- కేజీబీవీ బాలికలకు 53 వేలకుపైగా బంక్ బెడ్స్ ఏర్పాటు
- విద్యాశాఖ అధికారులతో మంత్రి నారా లోకేష్ సమీక్ష



**అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్)** : ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెం.1స్థానంలో ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎంశ్రీ పథకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన అధికారులను మిగతా 3లో...

## విద్యాలయానికి పూర్వవైభవం

- విమల విద్యాలయ పునఃప్రారంభానికి లోకేష్ కృషి
- ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగనున్న పాఠశాల
- విద్యార్థులు, సిబ్బందికి ఊరట



**అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్)** : నలభై ఏళ్లుగా విద్యల వెలుగుదివ్వెగా నిలిచిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్ ఉక్కునగరం, సెక్టార్-6లో ఉన్న విశాఖ విమల విద్యాలయంపై ఆర్థిక ఇబ్బందుల చీకట్లు కమ్ముకున్నాయి.

మిగతా 3లో...

## వైద్యసేవలపై మరింత నిఘా

- వైద్యులు, ఆసుపత్రుల పనితీరుపై త్రైమాసిక మదింపు
- కూటమి రెండేళ్ల పాలనలో సేవల విస్తరణ.. హాజరులో గణనీయ పెరుగుదల
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమగ్ర నివేదిక అందజేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్)** :రాష్ట్రంలో గత రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపరచడానికి వైద్యారోగ్య శాఖ చేసిన ప్రయత్నాలు, సాధించిన ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారంనాడు సమగ్రమైన నివేదికను అందజేశారు. నాలుగు పేజీల సమీక్షతో కూడిన లేఖతో పాటు విభాగాలవారీగా సాధించిన ఫలితాలపై 8 పేజీల నివేదికను మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి పంపారు.

**వైద్యులు, ఆసుపత్రుల స్థాయిలో పనితీరు మదింపు** : గత ప్రభుత్వం నుంచి ఆరోగ్య రంగంలో వారసత్వంగా సంక్రమించిన సమస్యల్ని పరిష్కరించి, ప్రజారోగ్య వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టడం ద్వారా మొదటి ఏడాది కంటే రెండో ఏడాదిలో మరింత సానుకూల ఫలితాలు లభించాయని మంత్రి తన లేఖలో ముఖ్యమంత్రికి వివరించారు.

మిగతా 3లో...

## సొంతింటి స్వప్నం సాకారం



- రెండేళ్లలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
- మరో 4 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో
- ప్రతి అర్హ కుటుంబానికీ సొంతింటే లక్ష్యం : మంత్రి పార్థసారధి

**అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్)** :రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో గృహ నిర్మాణ రంగానికి కొత్త ఊపిరి వచ్చిందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.

మిగతా 3లో...

## గనుల రంగంలో సంస్కరణలు

- పారదర్శకత, సాంకేతికతతో ఆదాయానికి కొత్త ఊపు
- 172 కొత్త మైనింగ్ లీజులతో రూ.172 కోట్ల రాబడి
- ఖనిజ సంపదను ప్రజల సంక్షేమానికి వినియోగిస్తున్నాం: మంత్రి కొల్లు రవీంద్ర




**అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్)** :రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం, పరిశ్రమలు, ఉపాధి, పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గనుల రంగంలో సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, గనులు ఒ భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గనుల రంగంలో పారదర్శకత, సాంకేతికత, సంస్కరణలకు ప్రాధాన్యత ఇస్తూ ఖనిజ సంపదను ప్రజల సంక్షేమానికి వినియోగిస్తున్నామని చెప్పారు.

గత ప్రభుత్వ కాలంలో అక్రమ మైనింగ్, ఇసుక విధానంలో అవకతవకల కారణంగా రాష్ట్రానికి నష్టం వాటిల్లిందని పేర్కొన్న మంత్రి, గనుల రంగ పునరుద్ధరణకు 2025 మైనర్ మినరల్ పాలసీని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ విధానంతో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ప్రభుత్వ ఆదాయం పెరిగిందన్నారు. గత రెండేళ్లలో 1700కు పైగా దరఖాస్తులు రాగా, 172 కొత్త మైనింగ్ లీజులు మంజూరు చేసి రూ.172 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు.

మేజర్ మినరల్స్‌లో భాగంగా 21 ఖనిజ బ్లాకులను వేలం వేయగా 11 మైనింగ్ లీజులు, 10 కాంపోజిట్ లైసెన్సులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలకు ఉపశమనం కల్పించామని, ఇప్పటివరకు 1.91 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేసినట్లు చెప్పారు.

మిగతా 3లో...

# పేదలకు చేరేలా పారిశ్రామిక ఫలాలు

(మొదటి పేజీ తరువాయి)

డేటా సెంటర్ల అనుమతుల విషయంలో దీన్ని దృష్టిలో పెట్టుకోవాలి. సెమీ కండక్టర్లపై ఎక్కువ దృష్టి సారించాలి. దానికి సంబంధించిన ఎకోసిస్టంపై ఎక్కువ ఫోకస్ చేద్దాం. ఇక మైక్రో ఇరిగేషన్ రైతుల కోసం మైక్రో ఇరిగేషన్ ఎక్విప్మెంట్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి. మైక్రో ఇరిగేషన్ పరికరాల తయారీ కంపెనీలను ఎంకరేజ్ చేద్దాం. భవిష్యత్తులో హార్టికల్చర్, ఫ్లోరీకల్చర్ కు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి. దీంతో మైక్రో ఇరిగేషన్ కు ప్రాధాన్యత పెరుగుతుంది. ఈ క్రమంలో మైక్రో ఇరిగేషన్ పరికరాల పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. దీని వల్ల రైతులకూ తక్కువ ధరలో మైక్రో ఇరిగేషన్ ఎక్విప్మెంట్ అందుబాటులోకి వస్తుంది. అమరావతిలో ఏఐ, అల్గారిథమ్స్ క్వాంటం అప్లికేషన్ల రూపకల్పన మొదలైంది. ప్రాజెక్టుల అనుమతులు, భూ కేటాయింపులు వంటివి సులభతరంగా అందించాలి. దీంతో పాటు రాజకీయ జోక్యం అనేది లేకుండా చూడాలి. అన్ని నిబంధనలు పాటించిన ప్రాజెక్టులకు ఆటోమోషన్ పద్ధతిలో అనుమతులు లభించే విధానాన్ని అనుసరిస్తే.. రాజకీయ జోక్యం తగ్గిపోతుంది. ఆ దిశగా అధికారులు ఆలోచనలు చేయాలి. అమరావతి క్వాంటం వ్యాలీకి సంబంధించి ఓ ఎకోసిస్టమ్ రావాలి. టవర్లతో పాటు టెక్నాలజీ పార్క్ రావాలి. క్వాంటం అప్లికేషన్లతో పాటు క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు కూడా రావాలి. మరోవైపు ఆటోమొబైల్ పరిశ్రమలకు శ్రీసిటీ సహా అనంతపురం జిల్లా కూడా కీలకం. తిరుపతి, శ్రీసిటీలు రాయల్ ఎన్ ఫీల్డ్, ఇసుజు, హీరో లాంటి ఆటోమొబైల్ కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయి. అనంతపురంలో కియా కార్ల ఉత్పత్తి జరుగుతోంది. పుట్టపర్తిలో 5వ జనరేషన్ ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కేంద్రం వేగంగా గ్రౌండ్ కావాలి. ఫైటర్ జెట్ తయారీ కేంద్రం పనుల విషయంలో నిరంతరం ఫాలో అప్ చేస్తూ ఉండాలి. కేంద్రానికీ ఎప్పటికప్పుడు నివేదికలివ్వాలి. ఏమైనా ఇబ్బందులు వస్తే వెంటనే పరిష్కారం చూపాలి. బెంగుళూరు–పుట్టపర్తి డిఫెన్సు కారిడార్ గా మారుతుంది. ఏరోస్పేస్ కారిడార్ గా ఈ ప్రాంతాన్ని మార్చాలి. తాడిపత్రి– అనంతపూర్ మధ్య ఓ ఎయిర్ స్ట్రిప్ వచ్చేలా చూడాలి."అని సీఎం చంద్రబాబు సూచించారు.

**జొన్నగిరి... స్వర్ణగిరి :** "పర్యాటకులు ఎక్కువ సమయం రాష్ట్రంలో గడిపేలా హోటళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి. మహీంద్రా క్లబ్ సంస్థ బీచ్ రిసార్ట్, పులికాట్ లేక్ వద్ద కూడా ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. అరకు లాంటి ప్రాంతాల్లోనూ ఐటీడీపీ భాగస్వామ్యంతో మహీంద్రా ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. టెంపుల్ టూరిజంను ప్రోత్సహించేలా కొత్తగా అభివృద్ధి చెందుతున్న పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలను గుర్తించి వాటి వద్ద పెట్టుబడులు వచ్చేలా చూడాలి. తిరుపతి, అమరావతి, విశాఖలలో బాబా రామ్ దేవ్ యోగా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. గండికోట, పోలవరం ప్రాజెక్టు, అనంతపురం, కర్నూలు వద్ద పెద్ద ఎత్తున హోటళ్లు రావాల్సి ఉంది. హార్సిలీ హిల్స్ వద్ద మంచి రిసార్టులు ఏర్పాటు చేస్తే టూరిస్టులు మరింతగా పెరుగుతారు. సూర్యలంక బీచ్ మాస్టర్ ప్లాన్



తయారు చేయాలి... బెస్ట్ బీచ్ టూరిజం స్పాట్ గా సూర్యలంకను తీర్చిదిద్దాలి. పర్యాటక కార్యకలాపాలు పెద్ద ఎత్తున జరిగేలా చర్యలు చేపట్టాలి. అమరావతిలో వచ్చే పెట్టుబడులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఓ కేంద్రీకృత వ్యవస్థను ఏర్పాటు చేయాలి. డిస్ట్రిక్ట్ కూలింగ్, పైప్డ్ గ్యాస్, విద్యుత్ లాంటివి పూల్ గా ఇచ్చే పరిస్థితి వస్తే ప్రాజెక్టుల వ్యయం తగ్గుతుంది. రేర్ ఎర్త్ మినరల్స్ కు ఏపీ కేంద్రంగా మారాలి. రేర్ ఎర్త్ మినరల్స్ కు సంబంధించిన ఎండ్ టూ ఎండ్ సొల్యూషన్స్ ఏపీలో అందుబాటులో ఉండేలా ఎకోసిస్టమ్ రావాలి. రేర్ ఎర్త్ మినరల్స్ పై ఓ ప్రత్యేక విద్యా సంస్థ ఏర్పాటు చేస్తే బాగుంటుందేమో ఆలోచన చేయాలి. జొన్నగిరి గోల్డ్ మైన్ 1000 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. జొన్నగిరి అత్యంత పురాతన చరిత్ర ఉంది. ఒకప్పుడు జొన్నగిరికి స్వర్ణగిరి అని పేరుంది. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రాధాన్యత, ప్రోత్సాహం ఇవ్వాలి. విశాఖ నగరంలో ప్రస్తుత సదుపాయాలను మరింత మెరుగు పరుస్తూనే.. శాటిలైట్ టౌన్ షిప్ లు అభివృద్ధి జరిగేలా చూడాలి. పరిశ్రమలతో పాటు.. హౌసింగ్ కూడా ఉండాలి. పారిశ్రామిక ప్రాంతాల వద్ద అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు జరిగేలా చూడాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేస్తేనే ప్రోత్సాహకాలు: మంత్రి లోకేష్ :** ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేస్తేనే ప్రోత్సాహకాలు, మినహాయింపులను అమలు చేయాలని ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ సూచించారు. భూ కేటాయింపులు జరిగిన తర్వాత వేగంగా ప్రాజెక్టులు ప్రారంభం కావాలి... అప్పుడే జీఎస్టీ సహా వివిధ మార్గాల ద్వారా రాష్ట్రానికి ఆదాయం వస్తుందని... అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వవచ్చని లోకేష్ అభిప్రాయపడ్డారు. ఇక ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలను స్థానిక పరిశ్రమలతో మ్యాపింగ్ చేసి దానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుతున్నామని లోకేష్ వివరించారు. ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్ పరిశోధనపై సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే ఇటీవల చేపట్టిన రష్యా పర్యటనలో తాను గమనించిన అంశాలను లోకేష్ ప్రస్తావించారు. రష్యాలో క్వాంటం అప్లికేషన్లకు సంబంధించి ఓ ప్రత్యేకమైన ఎకోసిస్టమ్ ఏర్పాటు అయి ఉందని లోకేష్ చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని, టీజీ భరత్, కందుల దుర్గేష్, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**18వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించిన కంపెనీలు, పెట్టుబడుల వివరాలు:**

1.ఎన్టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ, రూ. 6000 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉద్యోగ అవకాశాలు- అనంతపురం

2.ఆరాధ్య బయోఫ్యూయెల్ ప్రై.లిమిటెడ్ రూ. 75.78 కోట్ల పెట్టుబడి, 402 మందికి ఉద్యోగాలు, కృష్ణా జిల్లా

3.సమయ్ బయో సీఎన్జీ చిత్తూర్ ప్రై.లిమిటెడ్ రూ.120 కోట్లు పెట్టుబడి, 260 ఉద్యోగాలు, చిత్తూరు

4.శ్రీవాయు బయోఫ్యూయెల్స్, రూ.67.22 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు, కాకినాడ

5.ఆంధ్రా బయో ఎనర్జీ, రూ.96.40 కోట్ల పెట్టుబడి, 518 మందికి ఉద్యోగాలు, అనకాపల్లి

6.విక్సిత్ అగ్రి గ్రీన్ ఎనర్జీ, రూ.141.65 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు, ఎన్టీఆర్ జిల్లా

7.కంట్రోల్ ఎస్ డేటా సెంటర్, రూ.2788.30 కోట్ల పెట్టుబడి, 160 మందికి ఉద్యోగాలు, అనకాపల్లి

8.జెట్ ఫ్యాబ్ ఇండియా, రూ.740 కోట్ల పెట్టుబడి, 1049 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లా

9.ఇన్ ఫినిక్స్ టెక్నాలజీ సొల్యూషన్స్, రూ.170 కోట్ల పెట్టుబడి, 4000 మందికి ఉద్యోగాలు, విశాఖ

10.ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్, రూ.50 కోట్లు, 1000 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం

11.ఇ-ప్యాక్ డ్యూరబుల్, ఇ-ప్యాక్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీస్, రూ.1084.31 కోట్ల పెట్టుబడి, 1600 మందికి ఉద్యోగాలు, నాయుడుపేట, శ్రీసిటి, తిరుపతి జిల్లా

12.ఆంబర్ ఎంటర్ ప్రైజెస్, రూ.445 కోట్ల పెట్టుబడి, 1250 మందికి ఉద్యోగాలు, శ్రీసిటి తిరుపతి జిల్లా

13.ఎంసీఎన్ఈఎక్స్ ఇండియా, రూ.347 కోట్లు, 1633 మందికి ఉద్యోగాలు, శ్రీసిటీ తిరుపతి జిల్లా

14.వరుణ్ హాస్పిటాలిటీ ప్రై.లిమిటెడ్, రూ.280.33 కోట్ల పెట్టుబడి, 600 మందికి ఉద్యోగాలు, అమరావతి

15.ఇంద్రోయల్ హాస్పిటాలిటీ సర్వీసెస్, రూ.539 కోట్ల పెట్టుబడి, 600 మందికి ఉద్యోగాలు, అమరావతి

16.విజయనగర్ ఇన్వెస్ట్మెంట్స్ ఇన్ ఫ్రా, రూ.53.35 కోట్ల పెట్టుబడి, 225 మందికి ఉద్యోగాలు, ఆనందపురం, విశాఖ

17.దైవిక్ హోటల్స్ ప్రైలిమిటెడ్ రూ.186.84 కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉద్యోగాలు, అమరావతి

18.శుభసంకల్ప్, రూ.174.52 కోట్లు, 300 మందికి ఉద్యోగాలు

19.వెసెల్లా 5 స్టార్ హోటల్స్, రిసార్ట్స్ రూ.210.14 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు, కర్నూలు

20.దుర్గా కందేవ్–పద్మా హాస్పిటాలిటీ కన్సార్టియం, రూ.163.36 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం

21.వైట్ ఓక్ రిసార్ట్స్ , రూ.79.01 కోట్లు పెట్టుబడి, 250 మందికి ఉద్యోగాలు, విశాఖపట్నం

22.ఎస్ఏఇఫ్ ఒన్ ఇండియా–ఎస్పీ కాంపాక్ట్ లిమిటెడ్ రూ.1900 కోట్ల పెట్టుబడి, 2500 మందికి ఉద్యోగాలు, కాకినాడ

23.ప్రోటీరియల్ ఇండియా, రూ.2,250 కోట్లు, 530 మందికి ఉద్యోగాలు, అనకాపల్లి

24.నాన్ మాగ్నెటెక్ ప్రై.లిమిటెడ్, రూ.1250 కోట్లు, 400 మందికి ఉద్యోగాలు, తిరుపతి

25.ఏపీ జెఎస్ డబ్ల్యూ స్టీల్స్ , రూ. 1230.20 కోట్లు, 155 మందికి ఉద్యోగాలు, ప్రకాశం జిల్లా

26.వయోనా ఎనర్జీ, రూ.468 కోట్లు పెట్టుబడి, 1300 మందికి ఉద్యోగాలు, నెల్లూరు జిల్లా

27.బెర్జర్ పెయింట్స్ , రూ.176.82 కోట్ల పెట్టుబడి, 40 మందికి ఉద్యోగాలు, సత్యసాయి జిల్లా

28.డివైస్ ఫార్మా టెక్ రూ.213.9 కోట్ల పెట్టుబడి, 114 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లా

29.ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.63.94 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు, ఏలూరు

30.రెనాటస్ ప్రోడక్ట్స్ , రూ.350 కోట్లు, 370 మందికి ఉద్యోగాలు, తిరుపతి జిల్లా

31.ప్రీమియర్ ఎనర్జీస్ ఇంగాట్ వేఫర్, రూ.3936.20 కోట్ల పెట్టుబడులు, 540 మందికి ఉద్యోగాలు, తిరుపతి

32.జీరో 21 రెన్యూవబుల్ ఎనర్జీ- రూ.525 కోట్లు పెట్టుబడి, 625 మందికి ఉద్యోగాలు, కర్నూలు

33.అనంత్ టెక్నాలజీస్ రూ.1000 కోట్ల పెట్టుబడి 750 మందికి ఉద్యోగాలు, నెల్లూరు జిల్లా

34.స్పేస్ ఫీల్డ్స్ ప్రై.లిమిటెడ్, రూ.46.83 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు, అనంతపురం

35.ఐకామ్ టెలి, రూ.895 కోట్లు పెట్టుబడి, 1320 మందికి ఉద్యోగాలు, జగ్గయ్యపేట

36.అవెరాన్ పానల్స్, రూ.1123 కోట్ల పెట్టుబడి, 1200 మందికి ఉద్యోగాలు, గుడిపల్లె, శాంతిపురం చిత్తూరు

37.సర్లా ఏవియేషన్, రూ.330 కోట్ల పెట్టుబడి, 40 మందికి ఉద్యోగాలు, తిమ్మ సముద్రం, అనంతపురం

38.న్యూట్రీ ఫీడ్స్ అండ్ ఫార్మ్స్, రూ.216 కోట్ల పెట్టుబడి, 480 మందికి ఉద్యోగాలు, చిత్తూరు

39.పతంజలి ఆయుర్వేద్, రూ.370.10 కోట్ల పెట్టుబడి, 2000 మందికి ఉద్యోగాలు, విజయనగరం

**అమరావతి క్వాంటం వ్యాలీ లో పెట్టుబడి ప్రతిపాదనలు :** 40.క్యూపిఐ ఏఐ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, రూ.47.16 కోట్లు, 9 మందికి ఉద్యోగాలు, అమరావతి

41.ఇంజిన్యువటీ నెక్సస్ టెక్నాలజీస్, రూ. 0.5 కోట్లు, 21 మందికి ఉద్యోగాలు, అమరావతి

42.సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్- సి.డాట్ రూ.10 కోట్లు, 5 మందికి ఉద్యోగాలు

43.క్యూబిట్ ఫోర్స్, రూ.100 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతి క్వాంటం వ్యాలీ

44.ఆటోమోనిక్స్, రూ.79.8 కోట్లు, 190 మందికి ఉద్యోగాలు, అమరావతి క్వాంటం వ్యాలీ

45.క్రిప్ట్ షీల్డ్ , రూ10 కోట్లు, 20 మందికి ఉద్యోగాలు, అమరావతి

46.క్వాంటం బయో సైన్సెస్, రూ.22.5 కోట్లు, 10 మందికి ఉద్యోగాలు, అమరావతి

47.ఫ్రూగల్ ఏఐ, రూ.2.6 కోట్లు, 6 మందికి ఉద్యోగాలు,అమరావతి

48.క్యూరియమ్ రూ.0.45 కోట్లు, 5 మందికి ఉద్యోగాలు, అమరావతి

49.క్యూక్రిషి, రూ.25 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతి

50.ఎస్ఏఎస్ క్యూట్ ఎలక్ట్రానిక్స్ రూ.60 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు, అమరావతి

మొత్తం రూ. 30515 కోట్ల పెట్టుబడి, 29677 మందికి ఉద్యోగ అవకాశాలు.

# ఎంపీ టార్చర్‌పై హైకోర్టు సీరియస్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :**ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఐపీఎస్ అధికారి ఎం. సునీల్ నాయక్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్‌పై దాడి చేసిన వారికీ, ఎంపీని కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసిన వారికీ పెద్దగా తేడా లేదని ధర్మాసనం వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

ఇలాంటి ఘటనల్లో అధికారులు తమను తాము నియంత్రించుకోవాల్సిందని కోర్టు పేర్కొంది. ఎంపీని టార్చర్‌కు గురిచేయబోతున్న విషయం సునీల్ నాయక్‌కు తెలిసే ఉంటుందని, ఈ వ్యవహారంలో ఆయన ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కీలక పాత్ర పోషించారని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

సునీల్ నాయక్ ఎప్పటిలోగా సరెండర్ అవుతారో తెలియజేయాలని హైకోర్టు సూచించింది. సరెండర్ అవుతారా లేదా ముందస్తు బెయిల్‌పై వాదనలు కొనసాగిస్తారా అనే విషయాన్ని నిర్ణయించుకోవాలని పేర్కొంది. పిటిషనర్‌తో మాట్లాడి తదుపరి వివరాలను కోర్టు ముందు ఉంచుతామని సునీల్ నాయక్ తరఫు న్యాయవాది తెలిపారు.

విచారణ సందర్భంగా పోలీసులు పలు అంశాలపై ప్రశ్నలు లేవనెత్తారు. ఎంపీని అరెస్టు చేసే ప్రక్రియను ఎందుకు వీడియో రికార్డు చేయలేదని, నిబంధనలు ఎందుకు పాటించలేదని ప్రశ్నించినట్లు తెలిసింది. గుండె శస్త్రచికిత్స చేయించుకున్న వ్యక్తిని వైద్యుడి పర్యవేక్షణ లేకుండా హైదరాబాద్ నుంచి గుంటూరుకు తరలించడంపైనా కోర్టు ఆరా తీసింది.

అలాగే రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలు, వీడియో క్లిప్పింగులపై ఫోరెన్సిక్ పరీక్షలు నిర్వహించకుండానే అవి ప్రభుత్వ వ్యతిరేక వ్యాఖ్యలుగా ఎలా నిర్ధారించారని ప్రశ్నించినట్లు సమాచారం.

ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. అప్పటి సీఐడీ డీఐజీ సునీల్ నాయక్ (ఎ-2), ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ (ఎ-1)లపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో సునీల్ నాయక్‌ను పలు రోజుల పాటు విచారించినట్లు తెలిసింది.

సీఐడీ కార్యాలయంలో రాత్రి వేళల్లో జరిగిన పరిణామాలు, ఎవరి ఆదేశాల మేరకు వ్యవహరించారనే అంశాలపై అధికారులు ప్రశ్నలు అడిగారు. విచారణలో కొన్ని ప్రశ్నలకు ఆయన స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా దాటవేసినట్లు సమాచారం.

# డ్రగ్స్‌పై డేగ కన్ను



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తమ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ నిర్మూలన విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. యువతను మాదక ద్రవ్యాల బారి నుంచి రక్షించడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గురువారం జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ పరిధిలోని రాంకీ కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లో 20,876 కేజీల గంజాయి, 23 కేజీల హాష్ ఆయిల్‌ను పోలీసులు శాస్త్రీయ పద్ధతుల ద్వారా దహనం చేశారు. ఈ సందర్భంగా అనిత మీడియాతో మాట్లాడారు. గంజాయి సాగుకు చెక్ పెట్టాం..

సీఎం చంద్రబాబు ఆదేశాలతో 'ఈగల్' వ్యవస్థని ఏర్పాటు చేశామని హోం మంత్రి అనిత తెలిపారు. గంజాయి సాగు, రవాణాని అరికట్టేందుకు ప్రత్యేకంగా 'ఈగల్' వ్యవస్థ పనిచేస్తోందని వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగుకు చెక్ పెట్టామని అన్నారు. గిరిజనులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తూ గంజాయి సాగును అరికట్టామని చెప్పుకొచ్చారు. 18 నెలల్లో ఐదుసార్లు గంజాయిని ధ్వంసం చేశామని తెలిపారు. యువతను డ్రగ్స్ బారి నుంచి రక్షించడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని వివరించారు. ఒడిశా నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ఈగల్ టీమ్స్‌తో పాటు, ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు.

**యువత మత్తుకు దూరంగా ఉండాలి.. :** గంజాయి ముఠాలని సీసీటీవీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని హోం మంత్రి అనిత తెలిపారు. డ్రగ్స్ కేసుల విషయంలో వేగవంతంగా విచారణ చేస్తున్నామని చెప్పారు. యువత మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. గంజాయిపై ఏపీలో యుద్ధం ప్రకటించామని.. 'చైతన్యం', 'సంకల్పం' పేరుతో డ్రగ్స్ రహిత సమాజం కోసం పోలీస్ యంత్రాంగం అద్భుతంగా కృషి చేస్తోందని హోం మంత్రి అనిత కొనియాడారు.

# పొగాకు రైతుల ప్రయోజనాలే లక్ష్యం: మంత్రి గొట్టిపాటి రవికుమార్

(మొదటి పేజీ తరువాయి)

ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్. విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రకాశం జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల పొగాకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని మంత్రి గొట్టిపాటి చెప్పారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. పొగాకు బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే వేలం వేదికల ద్వారానే కొనుగోళ్లు జరగాలని, అనధికార లావాదేవీలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు పండించిన పంటకు సరైన విలువ దక్కేలా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేపడుతుందని చెప్పారు. ఉత్పత్తి పెరిగిందనే కారణంతో రైతులకు నష్టం కలిగించే నిర్ణయాలను అనుమతించబోమని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేసిందన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన పొగాకును తిరస్కరించడం వల్ల రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి పరిస్థితులు లేకుండా కనీస మద్దతు ధరగా రూ. 200 తగ్గకుండా కంపెనీలు కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు చెప్పారు. గత ఏడాది మార్కెట్‌లో లభించిన ప్రోత్సాహకర ధరల కారణంగా ఈసారి సాగు విస్తీర్ణం పెరిగిందని, సిగిరెట్ వంటి వాటిపై ట్యాక్సులు పెరిగాయనే కారణాలు చెప్పి పొగాకును తిరస్కరించరాదని మంత్రి స్పష్టం చేశారు. పండించిన పంటకు మార్కెట్ కల్పించే బాధ్యతను సంబంధిత సంస్థలు నిర్వర్తించాల్సిందేనని పేర్కొన్నారని తెలిపారు. భవిష్యత్తులో ఉత్పత్తి, డిమాండ్, కొనుగోలు సామర్థ్యం వంటి అంశాలను ముందుగానే సమీక్షించి పంట ప్రణాళిక రూపొందించే దిశగా చర్యలు చేపడతామని చెప్పారు. రైతులు, పొగాకు కంపెనీలు, బోర్డు అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.


# ఆక్వా రైతులకు ఊరట



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి, జూన్ 18 : ఆక్వా ఫీడ్ ధరల పెంపుతో గత కొన్ని రోజులుగా తలెత్తిన సమస్యకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిష్కారం చూపించారు. అటు ఆక్వా రైతులపై అధిక భారం పడకుండా, ఇటు ఫీడ్ తయారీదారులు నష్టపోకుండా ప్రస్తుత ధరపై రూ.4 తగ్గించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనికి ఫీడ్ తయారీదారులు, ఆక్వా రైతులు అంగీకరించారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో ఫీడ్ ధర కేజీకి ఇప్పుడున్న ఎంఆర్‌పీ రూ.112 నుంచి రూ.108కి తగ్గనుంది. దీనిపై చేపలు, రొయ్యల సాగు రైతులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సచివాలయంలో గురువారం ఉన్నతాధికారులు, ఆక్వారైతులు, ఫీడ్ తయారీదారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ధర తగ్గించడంతో పాటు... ఆక్వా ఫీడ్ ధర స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులు, అధికారులతో ఒక కమిటీ వేయాలని సీఎం ఆదేశించారు. 20 రోజుల్లోగా కమిటీ నివేదిక సమర్పించాలని, అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పారు. ఫీడ్ ధరలతో పాటు, ప్రాసెసింగ్ విధానం, కాలుష్య నియంత్రణ పైనా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరుసార్లు పెంచారని, అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై ఎటువంటి చొరవ తీసుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆక్వా రైతులు ఈ సందర్భంగా తెలిపారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయేనాటికి ఆ ధర రూ.107.80కి చేరిందని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందన్నారు. తామెప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించలేదని, ఇటీవల కొందరు ఆక్వా రైతుల ముసుగులో రాజకీయం చేశారని సీఎంతో అన్నారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఒకప్పుడు గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వాసాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని రైతులు గుర్తు చేశారు.

**సమస్యలు విన్నవించిన రైతులు :** ప్రస్తుతం ఆక్వాసాగులో ఎదురవుతోన్న సమస్యలను ముఖ్యమంత్రితో సమావేశంలో ఆక్వా రైతులు వెల్లడించారు. సాగుకు వినియోగించే అన్ని వస్తువుల ధరలు పెరిగాయని... కానీ ఆక్వా ఉత్పత్తుల ధరలు మాత్రం పెరగడం లేదన్నారు. ముడిసరుకు ధర పెరిగినప్పుడు ఫీడ్ ధర పెంచుతున్నారు కానీ, ముడిసరుకు ధర తగ్గినప్పుడు మాత్రం ఫీడ్ ధర తగ్గించడం లేదన్నారు. దీనికితోడు ప్రాసెసింగ్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. మత్స్యశాఖ నుంచి రైతులకు అందించే రాయితీలపైనా అందరికీ అవగాహన కల్పించాలని రైతులు కోరారు. రాయితీలకు సంబంధించి నిర్దేశించిన ఎంప్యానెల్ విషయంలో మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రొయ్యల చెరువులకు బీమా సౌకర్యాన్ని విస్తృత పరిచేలా చూడటంతో పాటు, నర్సరీ పాండ్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలన్నారు. అలాగే చేపలు, రొయ్యల చెరువులకు నీటి వనరులు అందించాలని రైతులు చేసిన విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదన్నారు.

**సోయా ధర పెరిగిందన్న ఫీడ్ కంపెనీల ప్రతినిధులు :** సోయా, ఫిష్ మీల్ వంటి ముడిసరుకు కొరత ఉందని, దేశీయంగా వీటి ధర కూడా అధికంగా ఉందని ఫీడ్ కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ధర తక్కువగా ఉన్న అమెరికా నుంచి సోయా దిగుమతులకు అనుమతి లేకపోవడంతో దేశీయ మార్కెట్లో రెట్టింపు ధరకు కొంటున్నామన్నారు. దీంతో ధరలు పెంచాల్సి వచ్చిందని వివరించారు. వాస్తవంగా రూ.20 ధర పెంచాల్సి



ఉన్నప్పటికీ...రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధర పెంపును రూ.12కి పరిమితం చేశామని చెప్పారు.

**ఆక్వా రైతులకు రూ.1,543 కోట్ల విద్యుత్ రాయితీ :** లక్షలాది మంది ఆధారపడిన ఆక్వారంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానికి ఉందని, ఈ రెండేళ్లలో రూ.1,543 కోట్ల మేర విద్యుత్ రాయితీ రూపంలో ఆక్వాసాగుకు ఇచ్చామని సీఎం అన్నారు. ఇప్పుడు కంపెనీలు ఫీడ్ ధరల పెంచడంతో జోక్యం చేసుకున్నామని సీఎం చెప్పారు. ధరల సమస్య పరిష్కారానికి అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని... అప్పుడే ఇద్దరికీ లబ్ధి కలుగుతుందన్నారు. రైతులు కూడా ఉత్పత్తి వ్యయం తగ్గించుకునేందుకు ఆలోచన చేయాలన్నారు. చేపలు, రొయ్యల రైతులు ఇద్దరికీ తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు సంఘాలు సమావేశాలు నిర్వహించుకుని సమస్యలకు పరిష్కారాలు వెతకాలని సీఎం చెప్పారు. ఆక్వారంగాన్ని ఆధునీకరించేలా, సాంకేతిక వినియోగం పెరిగేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆహారపు అలవాట్లు మారాయని, ఆక్వా ఉత్పత్తులకు మరింత డిమాండ్ పెరిగిందని దీనిని వినియోగించుకోవాలన్నారు. అమెరికా ఆంక్షలతో వేరే దేశాలకు మార్కెట్ విస్తరించేలా చేశామని చెప్పారు. నాణ్యత, సర్టిఫికేషన్ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిరప పంటకు పురుగుమందులు వినియోగించడంతో ఇటీవల ఎగుమతులను చైనా తిరస్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విషం విక్రయించే దందాకు అడ్డుకట్ట వేశాం



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. మత్తు మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటూ విషాన్ని విక్రయించే దందాను అరికట్టామని పేర్కొన్నారు. రాష్ట్రంలో గుంతల రోడ్లకు గుడ్ బై చెప్పామని, సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేసి రైతుల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నామని అన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వెయ్యికి పైగా ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి, ప్రభుత్వ సేవలు పొందడం ప్రజల హక్కుగా మార్చామని చెప్పారు. రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని, ఔటర్ రింగ్ రోడ్డును ఆంధ్రప్రదేశ్‌కు మణిహారంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజల విశ్వాసాన్ని పొందుతున్నామని అన్నారు.

రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ వికసిత భారత్ లక్ష్యంతో పాటు స్వర్ణాంధ్ర-2047 సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

శాసనమండలి సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత పాలనలో దెబ్బతిన్న వ్యవస్థలను తిరిగి గాడిలో పెడుతున్నామని తెలిపారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తదితరులు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పొన్నూరు, తాడికొండ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, తెనాలి శ్రావణ్ కుమార్, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు, చెరుకూరి తిరుపతిరావు, గాదె వెంకటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# పీఎంశ్రీ అమల్లో దేశానికే ఆదర్శం ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి లోకేష్ అభినందించారు. కడప మోడల్ లో ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభించామని, మెగా పీటీఎం నాటికి పూర్తిస్థాయిలో కిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 430 కేజీబీవీల్లో విద్యనభ్యసిస్తున్న 1,06,360 మంది విద్యార్థినులకు 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నారు. కేజీబీవీలతో పాటు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటుచేయాలని మంత్రి ఆదేశించారు.



**జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు కిట్స్ పంపిణీ** : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్ల పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసరమైన నిబంధనలను తొలగించాలని అన్నారు. ప్రైవేటు స్కూళ్లలో నిర్ణయించిన ఫీజులను స్కూళ్ల వెలుపల బోర్డులపై ప్రదర్శించడంతోపాటు పబ్లిక్ డొమైన్ లో పొందుపర్చాలని అన్నారు.

**అనాథ పిల్లలకు 'తల్లికి వందనం'** : రాష్ట్రంలోని అనాథ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం డబ్బులు అందేలా పక్కా చర్యలు తీసుకోవాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఈ పథకం అమలు కోసం పిల్లల గార్డియన్ల వివరాలను కచ్చితంగా సేకరించాలని, ఒకవేళ ఎవరూ లేని పక్షంలో ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, అక్కడ నుండి పిల్లలకు అందేలా చూడాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా, అనాథ పిల్లల బ్యాంక్ ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేసి, వారి చదువు పూర్తయిన తర్వాత ఆ సొమ్మును స్వతంత్రంగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానం ఆలోచన చెయ్యాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అటువంటి నిర్ణయం తీసుకోవడం వలన తల్లిదండ్రులు లేని పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా, వారి భవిష్యత్తుకు బలమైన ఆర్థిక భరోసా లభిస్తుందని మంత్రి అన్నారు.

**తెలుగు అకాడమీ పుస్తకాలు ఇక ఆన్‌లైన్‌లో** : తెలుగు అకాడమీ ముద్రించే టెక్స్ట్‌బుక్స్ ప్రజలందరికీ సులభంగా అందుబాటులోకి వచ్చేలా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ ఈ-కామర్స్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్స్ ద్వారా విక్రయించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలు నేరుగా ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే సదుపాయాన్ని వీలైనంత త్వరగా కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరుపై మంత్రి ప్రత్యేక దృష్టి** : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు వారి హాజరు శాతాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యాశాఖ మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి సీతారామరాజు, మరియు పోలవరం తదితర జిల్లాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆయా జిల్లాలలో ఉపాధ్యాయుల లభ్యతను సమీక్షిస్తూ విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఒక ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల పాఠశాల హాజరు 95 శాతానికి తగ్గకుండా పక్కా చర్యలు తీసుకోవాలని, అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా అత్యంత పారదర్శకంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**మాతృభాషను విస్మరించొద్దు** : పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలవుతున్న విద్యార్థుల్లో అధికశాతం మ్యాథ్స్, సైన్స్, తెలుగు సబ్జెక్టుల్లో విఫలమవుతున్న విషయాన్ని అధికారులు మంత్రి లోకేష్ దృష్టికి తెచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో మాతృభాష తెలుగును విస్మరించొద్దు, ఈ విషయంలో ఉపాధ్యాయులను అప్రమత్తం చేయండి, ఆయా సబ్జెక్టుల్లో బ్రిడ్జి కోర్సు మెటీరియల్ తయారుచేసి విద్యార్థులకు అందజేయాలి, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఇప్పటినుంచే వారికి అదనపు తరగతులు నిర్వహించి శిక్షణ ఇవ్వాలని మంత్రి లోకేష్ సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని మెరుగుపర్చడంపై టీచర్లు శ్రద్ధ వహించాలి. సాధ్యమైనంత త్వరగా హైస్కూలు విద్యార్థులకు క్రోమ్ బుక్స్ తో కూడిన కంప్యూటర్ ల్యాబ్స్ అందజేతకు చర్యలు చేపట్టాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి (ఇన్ ఛార్జి) శ్యామలరావు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, పాఠశాల విద్య డైరక్టర్ తమీమ్ అన్సారియా, సమగ్ర శిక్ష స్పెషల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి స్వప్నం సాకారం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించామని, మరో 4 లక్షల గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని వెల్లడించారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గతంలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. సొంత ఇల్లు ఆర్థిక భద్రతకు, సామాజిక గౌరవానికి పునాది అని పేర్కొంటూ, గృహ నిర్మాణ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

2014-19 మధ్యకాలంలో గృహ నిర్మాణ రంగంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టామని మంత్రి వివరించారు. అప్పట్లో 8.04 లక్షల ఇళ్లు మంజూరు చేసి, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.50 లక్షల యూనిట్ వ్యయంతో నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. అయితే గత ప్రభుత్వం గృహ నిర్మాణ రంగాన్ని నిర్లక్ష్యం చేయడంతో లక్షలాది పేద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను నిలిపివేయడం వల్ల ప్రజలు నష్టపోయారని విమర్శించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిచిపోయిన గృహ నిర్మాణాలపై దృష్టి సారించి వేగవంతం చేసిందని మంత్రి పార్థసారధి తెలిపారు. నిర్మాణ వ్యయాల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందించామని చెప్పారు.ౘపీహ్ 2.0 కింద మరిన్ని గృహాలు మంజూరు పొందేందుకు చర్యలు తీసుకుంటున్నామని, 2026-27 నాటికి ప్రతి అర్హ కుటుంబానికి సొంతింటి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.

## గనుల రంగంలో సంస్కరణలు

(మొదటి పేజీ తరువాయి)

అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టేందుకు డ్రోన్లు, ఉపగ్రహ పర్యవేక్షణ, జీఐఎస్ మ్యాపింగ్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని వివరించారు.

బీచ్ శాండ్ ఖనిజాల ఆధారంగా రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్ట్ త్వరలో వాణిజ్య ఉత్పత్తి దశకు చేరుకోనుందని, రాష్ట్రంలో బంగారు అన్వేషణను మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు. గనుల రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలక వనరుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ నిధులతో అత్యాధునిక వైద్య సేవలకు బాటలు పరిశీలన



- **రూ.23.75 కోట్లతో రాజమహేంద్రవరం క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణం**
- **పనులను పరిశీలించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్సీ సోము సోము వీర్రాజు**

రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్) : రాజమహేంద్రవరం ప్రభుత్వ టీచింగ్ జనరల్ హాస్పిటల్‌లో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ బ్లాక్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి గురువారం పరిశీలించారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ నిధుల ద్వారా రూ.23.75 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న సదుపాయాలు, వైద్య సేవలకు అవసరమైన మౌలిక వసతులపై అధికారులతో చర్చించారు.

ఈ బ్లాక్ అందుబాటులోకి వస్తే అత్యవసర వైద్యం, ప్రత్యేక చికిత్సా సేవలు మరింత బలోపేతం కానున్నాయని తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల నాణ్యత పెరగనుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్రతో పాటు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం బకాయిలపై రైతులకు అండగా బీజేపీ



- **రైతుల సమస్యపై బీజేపీ ఫిర్యాదుకు డీజీపీ తక్షణ స్పందన**
- **ధాన్యం బకాయిల పరిష్కారానికి ఏలూరు ఎస్పీకి ఆదేశాలు**
- **రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీజేపీ ముందడుగు - సాదినేని యామిని శర్మ**

ఏలూరు, (జర్నలిస్ట్ ఫైల్): పోలవరం పట్టిసీమ మండలానికి చెందిన కౌలు రైతుల ధాన్యం బకాయిల సమస్యపై రాష్ట్ర పోలీసు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తక్షణమే స్పందించారు. రైతుల సమస్యను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ డీజీపీ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే ఏలూరు జిల్లా ఎస్పీతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలో నిర్వహించిన '12 ఏళ్ల మోదీ పాలన - రైతు సంక్షేమం' కార్యక్రమంలో పాల్గొన్న యామిని శర్మకు పలువురు రైతులు తమ సమస్యలను వివరించారు. పోలవరం పట్టిసీమ మండలానికి చెందిన కౌలు రైతులు వీరపురాజు ధర్మరాజు సహా పలువురు రైతులు 2023 ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని మధ్యవర్తి మాదేపల్లి యోగేశ్వరరావు కొనుగోలు చేశారని, సుమారు రూ.15 లక్షల వరకు చెల్లించాల్సిన బకాయిలు ఇప్పటివరకు ఇవ్వలేదని తెలిపారు.

ఈ సమస్యపై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు కాలేదని రైతులు పేర్కొనగా, యామిని శర్మ డీజీపీ కార్యాలయాన్ని సంప్రదించారు. రైతుల సమస్యను పరిశీలించి న్యాయం చేస్తామని డీజీపీ హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. రైతులకు అండగా బీజేపీ ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

# విద్యాలయానికి పూర్వవైభవం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఆర్థిక సహాయాన్ని అకస్మాత్తుగా నిలిపివేయడంతో, జూన్ 2024లో బడి మూతబడింది.

గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రతిష్టాత్మక విశాఖ విమల విద్యాలయంను ఎలాగైనా పునఃప్రారంభించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యాలయం ఆరంభం అయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు మంత్రి లోకేష్ జారీ చేశారు. ఇది ఒక పాఠశాల సమస్యగా చూడకుండా, దశాబ్దాలుగా ఓ వెలుగు వెలిగిన ప్రతిష్టాత్మక విద్యాలయంని కొనసాగించే కృతనిశ్చయంతో పనిచేశారు. మంత్రి ప్రత్యక్ష పర్యవేక్షణలో, వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంగా పనిచేయడంతో విశాఖ విమల విద్యాలయం పునఃప్రారంభం అయ్యింది. ప్రభుత్వమే పాఠశాల నిర్వహణ బాధ్యతలను తీసుకుంది. విశాఖ వ్యాలీ స్కూల్ మోడల్‌లోనే కలెక్టర్ ఛైర్మన్‌గా విశాఖ విమల విద్యాలయంను నిర్వహించి పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా కృషి చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం చేశారు.

**స్టీల్ ప్లాంటునూ పరిరక్షించారు..** : విశాఖ స్టీల్ ప్రైవేట్ పరం కాకుండా కేంద్రంతో మాట్లాడి రూ.12 వేల కోట్లు ప్యాకేజీ సాధించిన కూటమి ప్రభుత్వం కృషిలో మంత్రి నారా లోకేష్ కీలకపాత్ర పోషించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు పనిచేసినట్టే, మూతబడిన విశాఖ విమల విద్యాలయంను తెరిపించేందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విశేష కృషి చేశారు. జూన్ 12న విశాఖ విమల విద్యాలయంను



విశాఖపట్నం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మళ్లీ ప్రారంభించారు. యూకేజీ వరకూ 55, 1 నుండి 10 వ తరగతి వరకూ 723 విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం కోసం వి.వి.విలో జాయినయ్యారు. పునఃప్రారంభం రోజునే వందలాది మంది పిల్లలు చేరడం విశాఖ విమల విద్యాలయం ప్రతిష్టను చాటిచెబుతోంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో పాఠశాలలో నేటి నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంను కూడా ఆరంభించారు.

**విశాఖ విమల విద్యాలయం చరిత్ర** : రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ విశాఖ ఉక్కు కర్మాగారం ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన ఉచిత విద్యను అందించేందుకు 1984లో ఆర్ సీఎం డయాసిస్ వారితో ఒప్పందం చేసుకుని విశాఖ విమల విద్యాలయంను ప్రారంభించారు. ఫ్రీ ఎడ్యుకేషన్ లక్ష్యంగా ప్రాజెక్టు స్కూలుగా దశాబ్దాలుగా నడిచింది. మొదట్లో కేవలం స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల పిల్లలకే స్కూలులో ప్రవేశాలు కల్పించేవారు. రాను రాను ఉద్యోగుల పిల్లలు తగ్గిపోవడంతో RINL కాంట్రాక్టు ఉద్యోగుల పిల్లలు, నిర్వాసితుల పిల్లలకు ఇక్కడ సీట్లు ఇచ్చేలా వెసులుబాటు కల్పించింది. ఉక్కునగరం పరిధిలో 36 కాలనీల పిల్లలను కూడా బడిలో చేర్చుకున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల పిల్లలు, పునరావాస కాలనీలు, నిరుపేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతో విశాఖ విమల విద్యాలయం పాత్ర గణనీయమైనది. =×చీూ ఆర్థిక సహాయాన్ని అకస్మాత్తుగా నిలిపివేయడంతో, జూన్ 2024లో విశాఖ విమల విద్యాలయంను ఆర్ సీఎం డయాసిస్ మూసివేసింది. మూసివేసే నాటికి సుమారు 2,200 మంది విద్యార్థులు, 100 మంది బోధన, బోధనేతర ఉద్యోగులు పనిచేసేవారు. నేరుగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుని ఈ విద్యాలయం పున:ప్రారంభం చేయడంతో వేలాది మంది విద్యార్థులకు వెలుగుబాట అయ్యింది. ప్రశ్నార్థకమైన టీచర్లు, సిబ్బంది భవితవ్యానికి ఒక భరోసా దొరికింది.

# వైద్యసేవలపై మరింత నిఘా

(మొదటి పేజీ తరువాయి)

మొదటి ఏడాదిలో వైద్యులు, ఇతర సిబ్బంది హాజరు 7 శాతం పెరగ్గా రెండో ఏడాది పాలనలో హాజరు 28.13 శాతం పెరిగిందని, తదనుగుణంగా వైద్య సేవల్లో భారీ పురోగతిని సాధించామని మంత్రి తెలిపారు. విస్తృతమైన ప్రభుత్వ వైద్య సేవలకు సంబంధించి మొత్తమ్మీద సానుకూల ఫలితాలు లభించినా, ఆసుపత్రులవారీగా, ప్రాంతాలవారీగా పనితీరులో వ్యత్యాసాలు కనిపించాయని, వీటిని అధిగమించి వ్యవస్థ పూర్తి సామర్థ్యాన్ని ప్రజలకు అందజేసే దిశగా చర్యల్ని చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తించామని మంత్రి వివరించారు.

**12,756 ప్రభుత్వాసుపత్రులు, 13,000 వైద్యులు** : 10,032 ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, 1145 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 560 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 244 సెకండరీ ఆసుపత్రులు, 38 బోధన మరియు స్పెషాలిటీ ఆసుపత్రులతో కలిపి మొత్తం 12,756 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో 13,000 కు పైగా వైద్యులు పనిచేస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ తన నివేదికలో వెల్లడించారు. ప్రతి వైద్యుడు, ఆసుపత్రి స్థాయిలో పనితీరును నిరంతరం సమీక్షిస్తూ ప్రజలకు మరింత అధిక స్థాయిలో నాణ్యమైన వైద్య సేవల్ని అందిస్తామని, ఈ దిశగా లక్ష్యాలను రూపొందిస్తామని మంత్రి వివరించారు.

ఒక రోజులో ఒక వైద్యుడు అందించాల్సిన ఓపీ, ఐపీ, శస్త్ర చికిత్సల సేవల సంఖ్యను ప్రమాణీకరించి, వీటి ఆధారంగా వైద్యుల లభ్యతను బట్టి ఆయా ఆసుపత్రులు అందించాల్సిన సేవల సంఖ్యలను నిర్ధారించి, తదనుగుణంగా లక్ష్యాల్ని నిర్దేశిస్తామని మంత్రి వివరించారు. ఈ ప్రమాణాల మేరకు నిరంతర పర్యవేక్షణతో మూడు నెలలకోసారి ప్రతి వైద్యుడు మరియు ప్రతి ఆసుపత్రి అందించిన సేవల్ని అంచనా వేసి, లక్ష్యాల మేరకు పనితీరును మెరుగుపరుచుకోవాల్సిన అవసరాన్ని వెల్లడిస్తామని మంత్రి తెలిపారు. దీని ద్వారా ప్రజారోగ్య వ్యవస్థ పూర్తి సామర్థ్యాన్ని ఆచరణలో అందుకోవడానికి అవకాశముంటుందని అన్నారు.

ఈ రీతిన ప్రతి వైద్యుడు, నర్స్, టెక్నీషియన్ మరియు ఆసుపత్రుల జవాబుదారీతనాన్ని పెంచడానికి పటిష్టమైన చర్యల్ని చేపడతామని మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి వివరించారు.

**ఆయుష్ సేవలకు ఊతం** : కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆయుష్ సేవల విస్తరణకు చేసిన ప్రయత్నాలు ఫలించాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గత ప్రభుత్వం ఈ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని , దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో రూ.124 కోట్ల కేంద్ర సాయాన్ని పొందగలిగిందని మంత్రి తెలిపారు. కేంద్ర సాయంతో కొత్త 6 ఏకీకృత(ఇంటిగ్రేటెడ్) ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుతో పాటు, 3 కొత్త కాలేజీల స్థాపనకు అనుమతులు సాధించామని మంత్రి వివరించారు.

**డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో భారీ వృద్ధి** : నిరాశానిస్పృహల్లో ఉన్న ప్రతిపక్షం అసత్య ప్రచారాలకు భిన్నంగా గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం భారీ వృద్ధి సాధించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి సోదాహరణంగా వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం కింద సగటున 8.20 లక్షల మంది మాత్రమే లబ్ది పొందగా ఈ సంఖ్య 74 శాతం పెరిగి ఏడాదికి 14.27 లక్షల మంది లబ్ది పొందారని మంత్రి వివరించారు. సగటు సాలీనా ఖర్చు రూ. 2,415 కోట్ల నుంచి రూ. 57 శాతం పెరిగి కూటమి పాలనలో రూ. 3,805 కోట్లకు పెరిగిందని, ఏడాదికి గత ప్రభుత్వం రూ.1,987 కోట్లు మాత్రమే నెట్వర్క్ ఆసుపత్రులకు విడుదల చేయగా, ఇది కూటమి హయాంలో 66 శాతం పెరిగి రూ.3,300 కోట్లకు పెరిగిందని మంత్రి వెల్లడించారు.

**ఆరోగ్యాంధ్ర దిశగా..** : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతతో రూపొందిన ఆరోగ్యాంధ్రప్రదేశ్ విజన్‌కు అనుగుణంగా , దీనికి అనుబంధమైన నూతన జనాభా నిర్వహణ లక్ష్యాల్ని సాధించే దిశగా అవసరమైన వ్యవస్థాగత ఏర్పాట్లపై రానున్న మూడేళ్లలో వైద్యారోగ్య మంత్రిత్వ శాఖ దృష్టి సారిస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి వివరించారు. లక్ష్య సాధనకు దోహదం చేసే వివిధ అంశాలకు సంబంధించి సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ల ఏర్పాటుకు కార్యక్రమాల రూపకల్పన చేపడతామని మంత్రి తెలిపారు.

అరుదైన వ్యాధులు(రేర్ డిసీజెస్) పెరుగుతున్న నేపథ్యంలో వీటి నియంత్రణకు అవసరమైన విషయ విజ్ఞాన సేకరణ, పరిశోధనలు, పరిష్కార మార్గాలు, సంబంధిత వైద్య సేవలు అందించడానికి అవసరమైన వ్యవస్థాగత ఏర్పాటుకు కృషి చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

వివిధ ఆరోగ్య కార్యక్రమాల్ని సంజీవిని పథకంతో అనుసంధానం చేసి పూర్తి స్థాయిలో డిజిటల్ వైద్య సేవల్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసి వైద్య సేవల్ని పొందడంలో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించడానికి కృషి చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తన నివేదికలో ముఖ్యమంత్రికి వివరించారు.

గత రెండేళ్లుగా ఆరోగ్య రంగానికి సంబంధించి ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం హితోధికంగా రాష్ట్రానికి సాయాన్ని అందించడం వల్ల మంచి ఫలితాల్ని సాధించగలిగామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తన లేఖలో వ్యాఖ్యానించారు.

## పొగాకు రైతుకు అండగా ప్రభుత్వం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మార్కెట్‌లో పొగాకు రకం ఏదైనా కిలో రూ.200 కంటే తగ్గడానికి వీల్లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో పొగాకు రైతులు, ట్రేడర్లతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించి పొగాకు ధరలపై సమీక్షించారు. ఇటు రైతులు, అటు ట్రేడర్ల సమస్యలను తెలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొగాకు రైతులను ఆదుకునేందుకు ట్రేడర్లు, కొనుగోళ్ల కంపెనీలు నూటికి నూరు శాతం మానవీయ కోణంలో రైతులకు సహకరించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పొగాకు వేలం కేంద్రాల్లో నో బిడ్, లో బిడ్ అనే మాటలకు తావుండకూడదన్నారు. రైతులు మార్కెట్టుకు తెచ్చిన పొగాకు బేళ్లను వెనక్కి పంపే పరిస్థితులు అస్సలు ఉండకూడదని చెప్పారు. మార్కెట్లోకి వచ్చిన పొగాకును కంపెనీలు కొనుగోలు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. దీనికి అనుగుణంగా అన్ని పొగాకు వేలం ప్లాట్‌ఫారమ్‌లను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని చేయాలని ఆదేశించారు. అలాగే పొగాకు కంపెనీలన్నీ తప్పనిసరిగా కొనుగోళ్లు చేపట్టాలని.. ఏ ఒక్క కంపెనీ కూడా వెనక్కు వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేశారు. టొబాకో బోర్డ్ పరిధిలో కాకుండా... అనధికారికంగా కొనుగోళ్లు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని... అవసరమైతే అరెస్టులు చేస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. తనకు రైతుల ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి... ఈ ఏడాది పొగాకు ట్రేడర్లు, కంపెనీలు ప్రభుత్వానికి, రైతులకు సహకరించాలని కోరారు. రాబోయే ఏడాది నుంచి మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే పొగాకు మార్కెట్ స్థిరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తుందన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని చెప్పారు. రైతులు, టొబాకో బోర్డు ప్రతినిధులను వెంట పెట్టుకుని ఢిల్లీ వెళ్లి సంబంధిత మంత్రులు, అధికారులను కలవాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రాం నారాయణ రెడ్డి, గొట్టిపాటి రవి కుమార్, డీవీబీ స్వామి, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, టొబాకో బోర్డ్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ గ్రామీణ యువతకు కేంద్రం నుంచి రూ.25 కోట్ల మంజూరు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :ఆంధ్రప్రదేశ్ గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూ-జీకేవై) పథకం కింద కేంద్ర వాటాగా రూ.25 కోట్లను మంజూరు చేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ యువత సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి అవకాశాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంత యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించడంతో పాటు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించే కార్యక్రమాలు మరింత విస్తరించనున్నాయని తెలిపారు.

డీడీయూ-జీకేవై పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఉపాధి కల్పన, స్వయం ఆధారిత జీవనోపాధుల అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలు అందించనున్నట్లు చెప్పారు. నిధుల మంజూరుతో రాష్ట్రంలో గ్రామీణ జీవనోపాధులు బలోపేతం కావడంతో పాటు యువత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు మరింత అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం యువత సాధికారతకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, సుసంపన్న ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి తోడ్పడుతుందని అన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం, విద్య మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. యువతకు మెరుగైన అవకాశాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలపై పెరుగుతున్న విశ్వాసం



-ఎం.పి.పి.ఎస్ చిన్నకొండూరులో నూతన అడ్మిషన్ల సందడి

**చౌటుప్పల్, (జర్నలిస్ట్ ఫైల్) :** నూతన విద్యా సంవత్సరం 2026-27లో భాగంగా మండల ప్రాథమిక పాఠశాల (ఎం.పి.పి.ఎస్) చిన్నకొండూరులో నూతన అడ్మిషన్లు ఉత్సాహభరితంగా కొనసాగు తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల నుంచి తీసుకువచ్చి ఎం.పి.పి.ఎస్ చిన్నకొండూరులో చేర్పించారు.ఈ సంద ర్భంగా చిన్నకొండూరు 7వ వార్డు సభ్యురాలు శ్రీమతి చెక్క ధనలక్ష్మి-శివకుమార్ దంపతులు తమ ఇద్దరు కుమారులను ప్రైవేట్ పాఠశాల నుంచి తీసుకువచ్చి మండల ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం విశేషం. అలాగే శ్రీ గరిసె లింగస్వామి తన ఇద్దరు కుమారులను, శ్రీ తిగుళ్ల వీరస్వామి తన కుమారుడు, కుమార్తెను, శ్రీ అంకూరి మల్లేష్ తన కుమార్తెను పాఠశాలలో చేర్పించారు.ఈ సందర్భంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. గ్రామంలోని ఇతర తల్లిదండ్రులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని తమ పిల్లలను ఎం.పి.పి.ఎస్ చిన్నకొండూరు పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తున్నాయని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి బలోపేతం చేయాలి



-మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి నిధులు కేటాయించి, పనులు ప్రారంభించాలి

-ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గంధసిరి జ్యోతిబసు.

**మరిపెడ, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ఈరోజు ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నూతన విద్యా సంవత్సరం మొదలైన సందర్భంగా ఎస్ఎఫ్ఐ మరిపెడ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు సందర్శించడం జరిగింది ఈ సందర్భంగా గంధసిరి జ్యోతిబసు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, మరిపెడ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ కి కేటాయించినటువంటి 5 ఎకరాల స్థలంలో నిరసన చేయడం జరిగింది., ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో ప్రభుత్వ పాఠశాలలను విస్తృతంగా సందర్శించడం జరుగుతుంది తక్షణమే ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించకుండా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మరిపెడ/బంగ్లా మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి గత ప్రభుత్వ హయాంలో 2021 లో 5 ఎకరాల భూమిని (పెద్ద రాయి గుండు) కేటాయించారు గత ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ని ఏర్పాటు చేయాలని అనేకసార్లు వినతులు ఇచ్చిన అధికారులు,ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులకు పదుల మీదున్న శ్రద్ధ విద్యావ్యవస్థ పై ఎందుకు లేదని ప్రశ్నించారు ఇప్పటికైనా మరిపెడ బంగ్లా మున్సిపాలిటీ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మరిపెడ మండల కార్యదర్శి పెద్దపులి బాసు, మండల సహాయ కార్యదర్శి బాణాల గోపి, నాయకులు రవి, వంశీ, నరేష్, సంతోష్, పృధ్వి తదితరులు పాల్గొన్నారు

## నాడు-నేడు అరకొర వసతులకు చెక్.. విద్యార్థులకు "యంగ్ ఇండియా స్టూడెంట్ కిట్" వరం



-పబ్బు రాజు గౌడ్ డిసిసి ఉపా ధ్యక్షులు యాదాద్రి భువనగిరి జిల్లా

**చౌటుప్పల్, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం విద్యా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వ పాఠ శాలల్లో చదువుతున్న విద్యా ర్థులకు "యంగ్ ఇండియా స్టూడ ెంట్ కిట్"లను అందజేయనుంది. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఇప్పటికే పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడగా, ఇప్పుడు విద్యార్థులకు అవసరమైన సామగ్రిని ఒకే కిట్ రూపంలో అందించి విద్యాభివృద్ధికి మరింత బాటలు వేస్తోంది.ఈ కిట్‌లో స్కూల్ బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్సిల్ బాక్స్, స్టేషనరీ వస్తువులు, బెల్ట్, టై, షూస్, సాక్స్, ఐడీ కార్డు తదితర అవసరమైన సామగ్రి ఉండనుంది. దీంతో విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు ప్రోత్సాహం లభించనుంది.అదనంగా, యూనిఫామ్ క్లాత్, స్కూల్ బ్యాగ్, బ్రాండ?టడ్ కిట్ల పంపిణీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో మరింత విశ్వాసం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ చర్యల వల్ల ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు నిలుస్తాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## వర్షాలు సమృద్ధిగా కురవాలంటూ గ్రామస్తుల కప్పతల్లి ఆట



**రామ్ మందిర్ ఏరియా, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 29వ డివిజన్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ గ్రామస్తులు సంప్రదాయ పద్ధతిలో కప్పతల్లి ఆట నిర్వహించారు. వర్షాభావం కారణంగా గ్రామంలోని చెరువులు, కుంటలు ఎండిపోవడంతో రైతులు, గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు కలిసి కప్పతల్లి ఆట ఆడి, వర్ష దేవతలను ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి, మాజీ సర్పంచ్ ఇరికెల్ల శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్జున్‌వల్లి శ్రీనివాస్, గంగారపు వెంకన్న, పులి లక్ష్మయ్య, కందుల నారాయణ, కొక్కుల శంకర్, ఇజ్జగిరి కనకయ్య, రాయమల్లు, అర్జున్‌వల్లి మల్లేష్, కావ్య దీమయ్య, అర్జున్‌వల్లి భీమలింగం, గొప్పుల నారాయణ తదితరులు పాల్గొన్నారు

## అంగన్‌వాడీ చిన్నారులకు డ్రెస్సులు పంపిణీ చేసిన కార్పొరేటర్ జంగపల్లి రమాదేవి శ్రీనివాస్



**రామ్ మందిర్ ఏరియా, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :** 35వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నా రులకు డ్రెస్సులు పంపిణీ చేస నట్లు డివిజన్ కార్పొరేటర్ జంగ పల్లి రమాదేవి శ్రీనివాస్ తెలిపా రు. చిన్నారుల విద్యా భివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్య క్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ జంగపల్లి రమాదేవి శ్రీనివాస్ మాట్లాడుతూ, చిన్నారుల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలు బలమైన పునాదులు వేస్తున్నాయని పేర్కొన్నారు. పిల్లలకు మెరుగైన విద్య, పోషకాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తు న్నాయని ఆమె అభినందించారు.డ్రెస్సుల పంపిణీ సందర్భంగా చిన్నా రులు ఆనందం వ్యక్తం చేయగా, తల్లిదండ్రులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## స్వచ్ఛమైన రామగుండం నిర్మాణమే లక్ష్యం.. చెత్త వేస్తే జరిమానా తప్పదు



-మేయర్ మహంకాళి స్వామి

**రామ్ మందిర్ ఏరియా, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :** జీహెచ్ఎంసీ తరహాలో రామ గుండం నగరాన్ని స్వచ్ఛంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రామగుండం మేయర్ మహం కాళి స్వామి తెలిపారు. బుధవారం డిప్యూటీ మేయర్ పాటిపల్లి అభిషేక్, కమిషనర్ డి. అనురాగ్‌రెడ్డి కలిసి 46వ డివిజన్ ఇందిరానగర్‌లో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. చెత్త వేయడానికి ప్రత్యేక ప్రదేశాలు ఏర్పాటు చేస్తున్నామని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.అదేవిధంగా మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, నీటి ప్రవాహం సజావుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరానగర్‌లో యూజీడీ, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని, స్వచ్ఛమైన రామగుండం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మేయర్ మహంకాళి స్వామి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది మరియు కాలనీవాసులు పాల్గొన్నారు

## బస్టాండ్‌కు మూడు స్టీల్ చైర్లు రెండు వాటర్ ఫ్రిజ్ లు అందజేసిన ఎన్‌టీపీసీ యాజమాన్యం



**రామ్ మందిర్ ఏరియా, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్‌టీపీసీ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రెండు వాటర్ ఫ్రిజ్లు ,మూడు స్టీల్ చైర్లను, అందజేసింది. ఎన్‌టీపీసీ హెచ్ఆర్ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, హెచ్ఆర్ బృందం సభ్యులు అందజేశారు బుధవారం ఎన్ టి పి సి హెచ్ ఆర్ బృందం ఈ మూడు స్టీల్ చైర్లను, రెండు వాటర్ ఫ్రిజ్ లు ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్. కవితకు అధికారికంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రయాణికులు ఎన్‌టీపీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు మరింత కొనసాగాలని వారు ఆకాంక్షించారు

## పెద్దపల్లి జిల్లాలో యూరియా నిల్వలు పుష్కలం...... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.



-రైతులకు ఎలాంటి కొరత లేకుండా పకడ్బందీగా ఎరువుల సరఫరా

-రెండు మూడు రోజుల్లో యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం

**పెద్దపల్లి, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :** .ప్రస్తుత వానాకాలం-2026 సీజన్‌కు సంబంధించి పెద్దపల్లి జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.నేటికి జిల్లాలో 18,750 మెట్రిక్ టన్నుల యూరియా, అ. వ 4,12,511 యూరియా బస్తాలు నిల్వలో ఉండి, యూరియా బుకింగ్ యాప్ ద్వారా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రతి వారం రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)తో పాటు ఇతర కంపెనీల నుంచి యూరియా నిల్వలు జిల్లాకు చేరుతున్నాయని పేర్కొన్నారు.ప్రస్తుత వానాకాలం సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల సరఫరాపై వ్యవసాయ శాఖ పకడ్బందీ ప్రణాళికతో పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వల్ల పంటల విత్తనాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం యూరియా బుకింగ్ యాప్‌ను తాత్కాలికంగా నిలిపివేశామని, మరో రెండు లేదా మూడు రోజుల్లో యాప్‌ను తిరిగి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.కావున పెద్దపల్లి జిల్లా రైతులు అందరూ యూరియా బస్తాల లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు

## రెడ్డి సంక్షేమ సంఘం సామాజిక బాధ్యత విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



**రామ్ మందిర్ ఏరియా, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్‌టీపీసీ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. 2026-27 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ పాఠశాలలైన ప్రాథమిక పాఠశాల మల్లాపూర్, ప్రాథమిక పాఠశాల న్యూపోరట్‌పల్లి, ప్రాథమిక పాఠశాల నర్సాపూర్, ప్రాథమిక పాఠశాల కాజీపల్లి విద్యార్థులకు మొత్తం 150 స్కూల్ బ్యాగులను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్‌టీపీసీ రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మండ బిక్షపతి రెడ్డి, డాక్టర్ కొసన రామారెడ్డి, ముల్క సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సందిరెడ్డి కోటా వెంకటరెడ్డి, గోపాల్ రెడ్డి, బయ్యపు రవీందర్ రెడ్డి, డ్రైవర్ మాడల విజయేందర్ రెడ్డి, చందుపట్ల సుధాకర్ రెడ్డి, గుడిపాటి శ్రీనివాస్ రెడ్డి, కొండ జనార్దన్ రెడ్డి, ఉట్ల బుచ్చిరెడ్డి తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, పేద విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం అందించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగి స్తామని తెలిపారు

## కాలనీల అభివృద్ధికి బాటలు: రోడ్ల పనులకు శంకుస్థాపన



**శేరిలింగంపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** శేరిలింగ ంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.1.88 కోట్లతో నూతనంగా చేపట్ట నున్న బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ బుధవారం శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా ప్రజయ్ షెల్టర్ నుంచి మక్త మహబూబ్ పెద్దకుడి చెరువు కల్వర్టు వరకు రూ.68 లక్షలతో సీసీ రోడ్డు, జనప్రియ వెస్ట్ సిటీ కాలనీలో రూ.54 లక్షలతో సీసీ రోడ్డుతో పాటు కమ్యూనిటీ హాల్ ఫ్లోరింగ్, బొల్లారం మెయిన్ రోడ్డు నుంచి నాగార్జున ఎనక్లేవ్ వరకు రూ.66 లక్షలతో బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామని, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, స్థానిక నాయకులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

# కార్పొరేట్ స్కూలు ఎక్కడో ఉన్నది, అంతకంటే మించిన హై స్కూలు మన పక్కనే ఉన్నది

- జిల్లా ప్రథమ స్థానంలో ఫలితాల కొరకు జల్లేపల్లి పాఠశాలలో మీ పిల్లల్ని చేర్పించండి
- హెడ్మాస్టర్ దార రాజేష్




**తిరుమలాయపాలెం, జూన్ 18 :** తిరుమలాయపాలెం మండల పరిధిలో జల్లేపల్లి గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలని చేర్పించి మంచి విద్యను పొందాలని స్కూల్ హెడ్మాస్టర్ దారా రాజేష్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఫలితాలను దృష్టిలో పెట్టుకోవాలని కార్పొరేట్ విద్యాసంస్థలను నమ్మి డబ్బులు వృధా చేసుకోవద్దని జల్లేపల్లి చుట్టుపక్కల ఉన్న గ్రామ పిల్లల తల్లిదండ్రులను విజ్ఞప్తి చేశారు. జల్లేపల్లి హైస్కూల్లో మీ పిల్లలను చేర్పించండి మీ పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తూ మంచి క్రమశిక్షణతో పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత మేము తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. గత పదవ తరగతి పరీక్షా ఫలితాలలో జిల్లాలో, మండలంలో ప్రభుత్వ పాఠశాలలో అన్నిటికన్నా మన పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిందని మన పాఠశాల నుండి త్రిబుల్ ఐటీ కి కూడ ఎంపికయ్యారని ఆయన గుర్తు చేశారు. పాఠశాలలోని వసతులను తెలియజేస్తూ విశాలమైన క్రీడా ప్రాంగణం పిల్లలందరికీ సరిపడా విశాలమైన గదులు, సైన్సు లేబరేటరీ, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం మంచి మెనూతో అందించే భోజన సదుపాయం అంతకంటే మించి కూడా మంచి అనుభవం గల తర్ఫీదు పొందిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ పరీక్షా సమయాలలో అదనపు తరగతులు బోధిస్తూ జిల్లాలో మండలంలో మిమ్ములను కార్పొరేట్ విద్యాసంస్థల కంటే కూడా అత్యధిక మార్కులతో ఉత్తమ క్రమశిక్షణతో తీర్చిదిద్దటమే మా లక్ష్యమని అందుకు మేము అందరం మీకు హామీ ఇవ్వగలుగుతామని ఆయన తెలియజేశారు. అడ్మిషన్లు జరుగుచున్నవి మంచి ఆలోచన చేసి మీ పిల్లలను మాపాఠశాలలో చేర్పించి మంచి నిర్ణయం తీసుకుంటారని మేము కోరుతున్నామని తెలియజేశారు.

# గాలి వాన బీభత్సం

## - విద్యుత్తు సరఫరాలో అంతరాయం





**చింతూరు (జర్నలిస్ట్ ఫైల్) :** బుధవారం సాయంత్రం చింతూరు మండలం లోని ఏజీ కోడేరు, మల్లె తోట, నరసింగ పేట, ఉలుమూరు తదితర గ్రామాల్లో గాలి బీభత్సం సృష్టించింది. నరసింగ పేటలో విప్పచెట్లు గాలికి కూలిపోయి విద్యుత్ తీగల పై పడింది. దీంతో సుమారుగా ఒక గంటన్నర పైగానే విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. కొద్దిపాటి చిరుజల్లులు పై గ్రామాల్లో పడ్డాయి. అలాగే నరసింగ పేట వద్ద వీఆర్ పురం రహదారిపై తాడిచెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలు కొద్దిసేపు స్పందించిపోయాయి. గ్రామస్తులు చెట్టుని తీసివేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. ఈ రెండు సంఘటనలతో చింతూరులో విద్యుత్ సౌకర్యం నిలిచిపోయింది. మరమ్మత్తుల అనంతరం విద్యుత్తును పునరుద్ధరించారు.

# అంతర్జాతీయ యోగా డే సందర్బంగా ముస్తపా నగర్ పిహెచ్ సి లో యోగా కార్యక్రమం నిర్వహణ







**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** అంతర్జాతీయ యోగా డే సందర్భంగా బుధవారం ఖమ్మం నగరం ముస్తఫా నగర్ యుపిహెచ్ సి నందు యుపిహెచ్ సి డాక్టర్. రమేష్ ఆధ్వర్యంలో యెగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్, ఆశా వర్క్స హాస్పిటల్ కు వచ్చిన రోగులతో యోగా ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఆయుర్వేదిక్, యునాని, హోమియో, వైద్యాశాలాల యోగా శిక్షకులు శ్రీకాంత్, ప్రసన్న, ఝాన్సీ, లెనిన్, సంధ్యారాణి, లక్ష్మి , మూడు వైద్యాశాలల సంబంధించిన ఆశా వర్క్స, యు పిహెచ్ సి స్టాఫ్ పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మరమ్మత్తు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

## – జిల్లా కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపడుతున్న మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇంజినీరింగ్ అధికారులతో కళాశాలల్లో కొనసాగుతున్న పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు రూ.3.31 కోట్ల వ్యయంతో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపడుతున్న విద్యుదీకరణ, మరుగుదొడ్ల మరమ్మత్తులు, నూతన తరగతులు గదుల నిర్మాణం, భవనాల మరమ్మత్తులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిని కళాశాలల వారీగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు కళాశాలల్లో అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మత్తు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సూచించారు.అనంతరం కళాశాలో విద్యార్థుల చేరికలు, ఇంటర్మీడియట్ ఫలితాలు, ఉత్తీర్ణత శాతంపై ప్రిన్సిపాళ్లను అడిగి తెలుసుకున్నారు. ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అవకాశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ శాఖ ఈ ఈ శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు క్యాన్సర్ వ్యాధి తప్పనిసరిగా నివేదించాల్సిన వ్యాధిగా ప్రకటింపు

## - జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు



**ఖమ్మం, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ జి.ఓ. ఎం.ఎస్. నెం.17, తేదీ 06-04-2026 ద్వారా క్యాన్సర్ వ్యాధిని రాష్ట్రవ్యాప్తంగా తప్పనిసరిగా నివేదించాల్సిన వ్యాధిగా ప్రకటించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు.రాష్ట్రంలో క్యాన్సర్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో, క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి, మరణాల రేటు, చికిత్స ఫలితాలు, భౌగోళిక వ్యత్యాసాలు, ప్రమాద కారకాలపై ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించి ప్రజారోగ్య ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్, స్వయంప్రతిపత్తి సంస్థల ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, ఈఎస్ఐ, రైల్వే, రక్షణ శాఖ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్, క్యాన్సర్ చికిత్స కేంద్రాలు, పాథాలజీ, రేడియాలజీ ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆరోగ్య బీమా సంస్థలు, జనన–మరణాల నమోదు కార్యాలయాలు, సంబంధిత ఇతర సంస్థలు తమ వద్ద నిర్ధారణ అయిన ప్రతి క్యాన్సర్ కేసును వ్యాధి నిర్ధారణ జరిగిన ఒక నెలలోపు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.క్యాన్సర్ రిజిస్ట్రేషన్ ద్వారా వ్యాధి నిర్ధారణ, చికిత్స, పాలియేటివ్ కేర్, పునరావాస సేవలు, దీర్ఘకాలిక పర్యవేక్షణ వంటి అంశాలపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వచ్చి, రాష్ట్రంలో క్యాన్సర్ నియంత్రణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్యులు, ల్యాబొరేటరీలు మరియు సంబంధిత సంస్థలన్నీ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించి, ప్రతి క్యాన్సర్ కేసును సకాలంలో నమోదు చేయాలని డా. డి. రామారావు కోరారు. క్యాన్సర్ కేసుల నివేదికలు పూర్తిస్థాయిలో అందినప్పుడే వ్యాధి భారాన్ని అంచనా వేసి, అవసరమైన చికిత్సా వసతులు, నివారణ చర్యలు, స్క్రీనింగ్ కార్యక్రమాలు, ప్రజారోగ్య విధానాలను మరింత సమర్థవంతంగా రూపొందించవచ్చని ఆయన తెలిపారు.

# 20వ, 18వ రక్షణ త్రైపాక్షిక సమీక్షా సమావేశం

## - కొత్తగూడెం, ఇల్లందు ఏరియాలకు సంయుక్తంగా సమావేశం





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :** కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ ఆర్.సి.ఓ.ఏ క్లబ్ నందు మంగళవారంన కొత్తగూడెం, ఇల్లందు ఏరియాలకు సంయుక్తంగా 20వ & 18వ రక్షణ త్రైపాక్షిక సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగినది.ఈ సమావేశం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, గని ప్రమాదాలలో మరణించిన వారికి మౌనం పాటించారు. రక్షణ గురించి ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం కొత్తగూడెం ఏరియా సేఫ్టీ అధికారి ఎం. వెంకటేశ్వర రావు గత 19వ రక్షణ సమావేశ మినిట్స్ పై ఏరియా లో రక్షణపై తీసుకుంటున్న చర్యల గురించి, ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు 19వ నేషనల్ సేఫ్టీ కాన్ఫరెన్స్ మినిట్స్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగినది. రక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని జీరో హాం ( ప్రమాద రహిత) తో పనిచేయాలని తెలియజేశారు. అనంతరం ఇల్లందు ఏరియా గత 17వ రక్షణ సమావేశ మినిట్స్ పై ఏరియాలో రక్షణపై తీసుకుంటున్న చర్యల గురించి, ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడం జరిగినది. అనంతరం యూనియన్ ప్రతినిధులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ లు, అన్ని గనుల మేనేజర్లు, రక్షణ అధికారులు రక్షణ పై చర్చించారు. అనంతరం డీజీఎంఎస్ అధికారులు, డీడీఎంఎస్ లు మాట్లాడుతూ గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలపై చర్చించి, గనుల్లో ప్రమాదాల నియంత్రణకు సింగరేణి యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని తెలియజేశారు అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బొగ్గు ఉత్పత్తి రవాణా చేసినందుకు కొత్తగూడెం ఇల్లందు ఏరియా వారిని అభినందించారు, ఇదే స్ఫూర్తితో రానున్న ఆర్థిక సంవత్సరంలో కూడా రక్షణను ఇంకా మెరుగు పరచుకొని రక్షణతో కూడిన ఉత్పతి చేయాలని తగు సూచనలు, సలహాలు ఇవ్వటం జరిగింది.కొత్తగూడెం & ఇల్లందు ఏరియాలలోని అన్ని యూనియన్ ప్రతినిధులు, అన్ని గనుల ఏజెంట్లు ప్రాజెక్టు ఆఫీసర్స్, శాఖధిపతులు, మేనేజర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు, గ్రూపు ఇంజనీర్స్, రక్షణ అధికారులు, పిట్ ఇంజనీర్స్, ఏరియా ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు వర్క్ మైన్ ఇన్స్పెక్టర్స్, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ప్రతినిధులు, యూనియన్ నాయకులు గనుల యొక్క పనితీరు రక్షణపై తీసుకుంటున్న జాగ్రత్తలపై వివరించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు తో పాటు ఐ. సత్యనారాయణ, డీఎంఎస్ (మైనింగ్), హైదరాబాద్ రీజియన్ టి. హరి ప్రసాద్, డీడీఎం ఎస్ (మైనింగ్) ఎస్కే. నాగుల్ మీరా, డీ డి ఎం ఏస్ (ఎలక్ట్రికల్) సుధీర్ కుమార్ బొల్లా, డీ డి ఎం ఏస్ (మెకానికల్) వి. మల్లికార్జున్, బ్రాంచ్ సెక్రటరీ ఏఐటీయూసీ, కొత్తగూడెం ఏ ఎండి. రజాక్, ఐ ఎన్ టీ యూ సి వైస్ ప్రెసిడెంట్, కొత్తగూడెం ఏ ఎస్. వి. రమణ మూర్తి, బ్రాంచ్ సెక్రటరీ ఏఐటీయూసీ, కార్పొరేట్ ఎస్. పీతాంబరం, ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్, కార్పొరేట్రీ ఎస్. సుధాకర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ, సత్తుపల్లి (ఎస్పీ ఎల్ ) కోటేశ్వర రావు, ఐ ఎన్ టి యు సి వైస్ ప్రెసిడెంట్, సత్తుపల్లి (ఎస్పీ ఎల్ఎండి. నజీర్ అహ్మద్, బ్రాంచ్ సెక్రటరీ ఏఐటీయూసీ, ఇల్లందు కె. వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్, ఇల్లందు ఎస్. వెంకట చారి, సీఎంపై, కార్పొరేట్రీ ఎం.వి. నరసింహారావు, సీఎంఓఏ, కొత్తగూడెం శివ ప్రసాద్, సీఎం ఓ ఏ, ఇల్లందు కె. సాయి బాబు, జీఎం (సేఫ్టీ) కార్పొరేట్రీ సిహెచ్. శ్రీనివాస్, జీఎం సత్తుపల్లి ఎం. షాలెం రాజు, జీఎం కొత్తగూడెం వీసం కృష్ణయ్య, జీఎం, ఇల్లందు కృష్ణ గోపాల్ తివారీ, జీఎం (సేఫ్టీ), కొత్తగూడెం రీజియన్ఆర్. కిరణ్ రాజ్‌కుమార్, సిఎంఓ (సీఎంవో)శ్రీమతి ఎం. ఉష / జి. సునీల, ఎసిఎంఓ (ఏసీఎంవో), మెయిన్ హాస్పిటల్ (ఎం హెచ్), కొత్తగూడెం (కేజీఎంఎ), అన్ని గనుల వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ కాంట్రాక్ట్ రిప్రజెంటేటివ్స్, అన్ని యూనియన్ ప్రతినిధులు, అన్ని గనుల ఏజెంట్లు మరియు ప్రాజెక్టు ఆఫీసర్స్, శాఖధిపతులు, మేనేజర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు, గ్రూపు ఇంజనీర్స్, రక్షణ అధికారులు, పిట్ ఇంజనీర్స్, ఏరియా స్ట్రక్చర్ కమిటీ సభ్యులు, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ప్రతినిధులు, యూనియన్ నాయకులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏన్కూర్ డిప్యూటీ తహసీల్దారుగా సులోచన

**ఏన్కూరు, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :**



ఏన్కూరు డిప్యూటీ తహసిల్దార్ గా ఎం సులోచన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ ఆర్ ఎల్ ఐ పి కాంతనపల్లి ప్రాజెక్టు పాల్వంచ నుండి ఇటీవల పెనుబల్లి కి బదిలీ అయ్యారు .అక్కడనుండి ఏన్కూరు కు డిప్యూటేషన్ పై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...... పెండింగ్ భూసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రైతులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు.

# పారిశుధ్యం పట్ల అప్రమతంగా ఉండాలి

- సీజనల్ వ్యాధులు రాకుండా ముందుస్తు చర్యలు
- ఖమ్మం డీఎల్పీవో విజయలక్ష్మి



**నేలకొండపల్లి, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :**

పారిశుధ్యం పట్ల అప్రమతంగా ఉండాలని ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్పీవో) విజయలక్ష్మి సూచించారు. మండలం లోని చెరువుమాధారం, బైరవునిపల్లి గ్రామాలలో బుధవారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. పంచాయతీ కార్యాలయాలలో పలు రికార్డులను పరిశీలించారు. నర్సరీ లు, పల్లె ప్రకృతి వనాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు...రానున్న వర్షాకాలం లో సీజనల్ వ్యాధులు రాకుండా పారిశుద్ధ్యం' పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా ప్రజలను చైనత్యం చేయాలని అన్నారు. తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. నర్సీరీలలో ప్రతీ మొక్క లెక్క ఉండాలన్నారు. సర్ కార్యక్రమం లో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కార్యదర్శులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాసరావు, ఆయా పంచాయతీ కార్యదర్శులు జీ.రవి, బీ. బాషా తదితరులు పాల్గొన్నారు.

# యూరియా బుకింగ్ పై అవగాహన కలిగి ఉండాలి

**- కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు సతీష్**



**నేలకొండపల్లి, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :**

యూరియా యాప్ బుకింగ్ పై రైతులకు అవగాహన కలిగి ఉండాలని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు సతీష్ పేర్కొన్నారు. మండలం లోని రాజేశ్వరపురం, నాచేపల్లి, మంగాపురంతండా తదితర గ్రామాలలో బుధవారం అవగాహన సదస్సు లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం ఇంటి నుంచే యూరియా ను బుకింగ్ చేసుకునేందుకు ప్రభుత్వం యాప్ ను ఏర్పాటు చేసిందన్నారు. బుకింగ్ చాలా సులభతరం అన్నారు. యూరియా పంపిణీ పారదర్శకంగా ఉండేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ కొనుగోలు కు సంబంధించి రశీదు లను తప్పకుండా తీసుకోవాలన్నారు. ఎలినో తుఫాన్ ప్రభావం వలన కాలం ను బట్టి పంటలను ఎంచుకోవాలన్నారు. పంట మార్పిడి చాలా అవసరం. అన్నారు. రైతులు గ్రహించి తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి యం.రాధ, చెరువుమాదారం మత్స్యపారిశ్రామిక సహాకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, సొసైటీ చైర్మన్ బాలాజీ, రైతు ప్రతినిధులు గోబ్రియా నాయక్, ఆయా ఏఈవో లు తదితరులు పాల్గొన్నారు.

# పాత లింగాల చెరువు కట్టను పరిశీలించిన కోరం కనకయ్య,ఇరిగేషన్ ఎస్ఇ శ్రీనివాసరెడ్డి

- రూ 2.16 కోట్ల రూపాయల తో శాశ్వత మరమ్మతులకు అధికారులకు ఆదేశం

**ఖమ్మం, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :**



కామేపల్లి మండలం పాత లింగాల చెరువు కట్ట గత సంవత్సరపు తుఫాన్ ప్రభావం వలన చెరువు కట్టకు గండ్లు పడి తెగిపోవడం వలన గత సంవత్సరం దానికి తాత్కాలిక మరమ్మతులు మాత్రమే చేపట్టడం జరిగింది. ఈ దశలో రాబోయే వానాకాలం సీజన్లో మళ్లీ చెరువు కట్ట తెగకుండా పూర్తిస్థాయిలో, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మాత్యులుఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు ల సహకారంతో రూ 2.16 కోట్లతో శాశ్వత మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఇరిగేషన్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట్ రామ్, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్, తోటకూరి శివయ్య లతో చెరువు కట్టను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైతాంగాన్ని వ్యవసాయాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలతో పాటు సాగునీటి సౌకర్యం కల్పించాలని అనేక అభివృద్ధి పథకాలను ప్రోత్సహిస్తున్నారని, దానిలో భాగంగా పాత లింగాల చెరువు కట్ట శాశ్వత పరిష్కారం కొరకు 8 మీటర్లు వెడల్పు 15 మీటర్లు లోతుతో పూర్తి కాంక్రీట్ నిర్మాణంతో మరమ్మతులు చేపట్టడం జరగనున్నదని, నాలుగైదు రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ జరుగుతుందని, ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. పాత లింగాల చెరువు కట్టకు శాశ్వత మరమ్మతులు చేపడుతున్నందుకు రైతులు హర్షం ప్రకటించి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్,డి ఈ భానుమూర్తి, ఏ ఈ శ్యాం కుమార్, సర్పంచ్ ఇట్ట శ్రీను, కిన్నెర సుజాత యడ్లపల్లి బాబు, పండగ కోటి బుచ్చయ్య, జూపూడి గోపాలరావు బైరెడ్డి యుగంధర్ రెడ్డి, లక్ష్మయ్య రమేష్ శ్రీను, రాయల లక్ష్మయ్య రాయల పెద్ద వెంకన్న, గింజల నర్సిరెడ్డి, జగన్నాథ రెడ్డి, భావ్ సింగ్, మరియు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

**- ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :**






అర్హులైన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ఈ నెల 25 నుండి ప్రారంభం కానుందని తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి ఏజెంట్ ల నియామకం చేయాలని, ఇంకనూ నియామకం చేయని రాజకీయ పార్టీలు వెంటనే ప్రక్రియ పూర్తి చేసి, జాబితా సమర్పించాలని అన్నారు. బూత్ స్థాయి అధికారులతో, బూత్ స్థాయి ఏజెంట్ లు ఇంటింటి ఎన్యుమరేషన్ లో పాల్గొనాలన్నారు. ఇంకనూ మ్యాపింగ్ కాని వారి నుండి 11 రకాల ధృవీకరణలో ఏది ఉన్న సేకరించి బూత్ స్థాయి అధికారికి అందజేయాలన్నారు. 1987 కంటే ముందు పుట్టిన వారు స్వంతంగా, 1987 నుండి 2004 మధ్యలో పుట్టిన వారు స్వంతం తో పాటు తల్లిదండ్రుల్లో ఒకరి, 2004 తర్వాత పుట్టిన వారు స్వంతంతో పాటు తల్లిదండ్రులు, తల్లిదండ్రులు లేకపోతే తాత, నానమ్మ ల ధృవీకరణలు ఆధార్ తో పాటు సమర్పించాల్సి ఉంటుందన్నారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ లు జూన్ 25 నుండి ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలు రెండు కాపీలు నింపి, ఒకటి ఓటరుకు, ఒకటి బూత్ స్థాయి అధికారుల వద్ద ఉంచుకోవాలన్నారు. మ్యాపింగ్ అయిన వారు ఎటువంటి డాక్యుమెంట్స్ సమర్పించాల్సిన అవసరం లేదని, మ్యాపింగ్ కానివారు 11 రకాల ధృవీకరణలలో ఏదో ఒకటి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో ప్రజలు భాగస్వామ్యం అవ్వాలని, ఇందుకై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎస్డీసి సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎంఏ. రాజు, డిటి అన్సారీ, బిజెపి పార్టీ ప్రతినిధులు వి. రాజేష్, బి. శ్యామ్ సుందర్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు లింగనబోయిన సతీష్ బాబు, బి. జసవంత్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. నరేందర్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు నెల్లూరి వీరబాబు, వై. రవి కుమార్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాల్ రావు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి చెరుకుపల్లి నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి ప్రతిభావంతులకు నగదు బహుమతి

- మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే రూ.25,116 లు బహుమతి
- గ్రామ స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే రూ.10,116 లు బహుమతి
- విద్యే జీవితానికి వెలుగుబాట



**బోనకల్, జూన్ 18 (జర్నలిస్ట్ ఫైల్) :**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని బోనకల్ సర్పంచ్ బానోతు జ్యోతి, ఉపసర్పంచ్ బానోతు కొండ అన్నారు. బోనకల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించి వారు మాట్లాడారు.ఈ సందర్భంగా పదో తరగతిలో ఉత్తీర్ణులై మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ.25,116 నగదు బహుమతి అందజేస్తామని, అలాగే గ్రామస్థాయిలో మొదటి స్థానం సాధిస్తే రూ.10,116 నగదు బహుమతి ప్రకటించారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించి, ఉన్నత ఫలితాలు సాధించేలా ప్రోత్సహించడమే ఈ నిర్ణయం లక్ష్యమని తెలిపారు.నేటి సమాజంలో విద్య ఎంతో విలువైన ఆస్తి అని, చదువుతోనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. పేదరికాన్ని జయించడానికి, మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి విద్యే ప్రధాన ఆయుధమని అన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పాఠశాలకు క్రమం తప్పకుండా పంపిస్తూ చదువులో ప్రోత్సహించాలని కోరారు. గ్రామం నుంచి మరింత మంది ప్రతిభావంతులు తయారై ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రోత్సాహానికి గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. విద్యార్థుల విజయం గ్రామాభివృద్ధికి పునాది అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పోటువెంకటేశ్వర్లు, మరిదు శేషు, మరియు ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఉండవల్లి గుహల వద్ద యోగా కార్యక్రమానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు



○ క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 20న తాడేపల్లి మండలం ఉండవల్లి గుహల వద్ద నిర్వహించనున్న యోగా కార్యక్రమానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ, ఇతర అధికారులతో కలిసి కార్యక్రమ ప్రాంగణాన్ని ఎస్పీ పరిశీలించారు.
ఈ సందర్భంగా ప్రాంగణం, ముఖ్య అతిథుల రాకపోకల మార్గాలు, వాహనాల పార్కింగ్, ప్రజల ప్రవేశం--నిష్క్రమణ మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవలు, భద్రతా సిబ్బంది మోహరింపు తదితర అంశాలను అధికారులు సమీక్షించారు. అనంతరం నిర్వహించిన ఏఎస్ఎల్ సమావేశంలో జనసందోహ నియంత్రణ, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక, వైద్య సేవల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో చర్చించారు.
కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బహుళ స్థాయి భద్రతా చర్యలు అమలు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్, ఎంటీఎంసీ కమిషనర్ ఎస్కే అలీం బాషా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వీఐపీ కార్యక్రమాల భద్రతకు ఏపీఎస్పీ బలగాల వసతి ఏర్పాట్ల పరిశీలన



○ మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** అమరావతి రాజధాని ప్రాంత పరిధిలో నిర్వహించనున్న వీఐపీ కార్యక్రమాలు, శాంతిభద్రతల నిర్వహణకు మోహరించనున్న ఏపీఎస్పీ బలగాల వసతి ఏర్పాట్లను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రహ్మానందపురం, మెల్లంపూడి గ్రామాల్లో అందుబాటులో ఉన్న రెండు భవనాలను సందర్శించి అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఏపీఎస్పీ సిబ్బందికి అవసరమైన వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు ముందస్తుగా పూర్తి చేయాలని ఎస్పీ ఆదేశించారు. విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టి, భద్రతా విధుల నిర్వహణకు అనుకూల వాతావరణం కల్పించాలని సూచించారు. రాజధాని ప్రాంతంలో జరిగే ముఖ్యమైన కార్యక్రమాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన ఏర్పాట్లను పటిష్టంగా చేయాలని అధికారులకు తెలిపారు. భద్రతా ప్రణాళిక ప్రకారం బలగాల మోహరింపు, వసతి ఏర్పాట్లలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా అదనపు ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏటీవీ రవికుమార్, నార్త్ డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, తాడేపల్లి సీఐ వీరేంద్రబాబు, ఇతర పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎరువులను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

**తెనాలి,( జర్నలిస్ట్ ఫైల్ ):** రైతులకు సకాలంలో ఎరువుల అందించేందుకు ప్రభుత్వం మొబైల్ యాప్ ను తీసుకొచ్చిందని తహసిల్దార్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ, సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి అధికారులకు సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, మండల పరిధిలో మొత్తం 40 ఎరువులు అందించే కేంద్రాలు ఉన్నట్లు ఆయన తెలియజేశారు. ఎరువులను ఎక్కడ కూడా బ్లాక్ మార్కెట్లో విక్రయించకుండా ఉండేందుకు ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకున్నట్లు తహశీల్దార్ గోపాలకృష్ణ తెలియజేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు ఎరువులను సకాలంలో అందజేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో సంక్షేమం - అభివృద్ధిలో గుంటూరు పశ్చిమకు రూ.500 కోట్ల పనులు

○ ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వ బలం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ గుంటూరు జిల్లా ఎన్డీయే కూటమి ప్రభుత్వ విజయోత్సవ బహిరంగ సభకు వందలాది భారీ బైక్ ర్యాలీతో కదిలిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ రెండేళ్లలో గుంటూరు పశ్చిమలోనే రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, తాగునీటి సదుపాయాలు, కాలువల్లో పూడిక తీత పనులు, ట్రాఫిక్ నిర్వహణ, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 500 కోట్లకు పైగా పనులు పూర్తిచేశామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా గుంటూరు జిల్లా విజయోత్సవ బహిరంగ సభకు ముందు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుపేట టీడీపీ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 600కు పైగా ద్విచక్ర వాహనాలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సభా ప్రాంగణానికి చేరుకున్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పై ప్రజలు ఉంచిన నమ్మకమే రెండేళ్లుగా ప్రభుత్వం విజయవంతంగా ముందుకు సాగడానికి కారణమని, గత ఐదేళ్లలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, అరాచకాలను గుర్తుచేసుకుంటూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలు ఇచ్చిన తీర్పును కూటమి ప్రభుత్వం గౌరవిస్తోందన్నారు.
గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనే సుమారు 20 వేల మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ. 9 కోట్లకు పైగా పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. అలాగే మూడు అన్నా క్యాంటీన్ల ద్వారా ప్రతిరోజూ దాదాపు 9 వేల మంది పేదలకు రూ. 5కే భోజనం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం మూసివేసిన అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించి పేదల ఆకలి తీర్చడం కూటమి ప్రభుత్వ గొప్ప నిర్ణయమన్నారు.
సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా గుంటూరు పశ్చిమలోనే రూ. 8 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద పార్టీ, రాజకీయ భేదాలు లేకుండా ప్రతి అర్హ కుటుంబానికి లబ్ధి చేకూరుస్తూ ఒక్క పశ్చిమ నియోజకవర్గంలోనే రూ. 32 కోట్ల మేర ప్రయోజనం కల్పించామన్నారు. దీపం పథకం ద్వారా రూ. 21 కోట్లకు పైగా లబ్ధి ప్రజలకు అందుతోందని వెల్లడించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ), నార్ల ఆడిటోరియం, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర కీలక ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు.
ప్రజలకు అందుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి కూడా వైసీపీ నాయకులు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు. చిన్న చిన్న లోపాలను భూతద్దంలో చూపిస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారని పేర్కొన్నారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో పయనిస్తోందని, అమరావతి, పోలవరం వంటి రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన ప్రాజెక్టులకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కూటమి నాయకులు ఇదే ఐకమత్యంతో రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలని కోరారు.

# మది నిండుగా.. రెండేళ్ల కూటమి పండుగ

○ ఉత్సాహంగా కదిలిన కూటమి శ్రేణులు

○ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

○ సంబరంగా సాగిన రెండేళ్ల ఉత్సవం

○ రెట్టించిన ఆనందంతో పని చేస్తామన్న నాయకులు, కార్యకర్తలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ఆంధ్రగడ్డపై సువర్ణ అధ్యాయం లిఖించామని శ్రేణులు ఉప్పొంగాయి. రెండేళ్ల సుపరిపాలన సందర్భంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ హెచ్ 16 వద్ద సాయినగర్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన వేడుకలకు కార్యకర్తలకు ఉరిమే ఉత్సాహంగా కదిలారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ముందుండి శ్రేణులు సమాయత్తం చేయగా.. ప్రతి కార్యకర్త గుండె సంబరంగా మారింది. వేల మంది నాయకులు, కార్యకర్తలు జై తెలుగుదేశం.. జైజై చంద్రబాబు అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని ప్రగతికి చిరునామాగా మార్చిన ఎమ్మెల్యే నసీర్ కు ధన్యవాదాలు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కూలిన కలల పునాదులపై రాష్ట్ర నిర్మాణానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని సంతోషం వ్యక్తం చేశారు. గుంటూరు తూర్పులో అధికంగా ఉన్న మైనారిటీ సోదరుల విద్యా, ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక పథకాలు, సబ్సిడీలను అందిస్తోన్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలుస్తామని నినదించారు. తల్లికి వందనం పథకం అందుకున్న తల్లిదండ్రులు, స్త్రీశక్తి పథకం ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలు, పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు, జాబ్ మేళాతో ఉద్యోగాలు పొందిన యువత .. ఇలా సంక్షేమ పథకాలు అందుకున్న వారంతా మంచి ప్రభుత్వాన్ని మనసారా ఆశీర్వదించారు. రేపటి తరం కోసం, నవ్యాంధ్ర ప్రగతి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అన్నారు. రెండేళ్ల పాలనలో గూగుల్ నుండి క్వాంటమ్ వ్యాలీ వరకు రాష్ట్రానికి తెప్పించి నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్తు అందించారన్నారు. నిన్నటి వరకు పక్క రాష్ట్రాల వైపు చూసిన మన బిడ్డలు, ఈరోజు మన సొంత గడ్డపైనే కొలువులు తెచ్చుకుంటున్నారని తెలిపారు.
సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేసి.. రెండేళ్ల పాలన బంపర్ హిట్ అనిపించిందన్నారు. రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఎదగబోతోందని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో అహర్నిశలు ప్రయత్నిస్తానని చెప్పారు.

## ఏఐ ఇంజనీరింగ్ పై వర్క్‌షాప్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ లోని సిఎస్ఈ మరియు సిఎస్ఎమ్ విభాగాల ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్ రంగంలో సరికొత్త మార్పు అయిన ఏఐ ఏజెంట్ల రూపకల్పనపై వర్క్‌షాప్ నిర్వహించినట్లు వివిఐటి విశ్వవిద్యాలయం ప్రో – ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. "ఏఐ ఇంజనీరింగ్ విత్ క్లాడ్ కోడ్: సాధారణ ప్రాంప్ట్ నుండి ఏఐ ఏజెంట్ల నిర్మాణం" అనే అంశంపై ఈ కార్యక్రమం జరిగింది. ఈ వర్క్‌షాప్‌నకు ముఖ్య వక్తగా అమెరికాలోని మిన్నెసోటాకు చెందిన ప్రముఖ ఏఐ కన్సల్టెంట్ డా॥ శివ జాస్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత, క్లాడ్ కోడ్ వినియోగం, ప్రాంప్ట్ ఇంజనీరింగ్ నుండి ఏఐ ఏజెంట్లను అభివృద్ధి చేసే విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు.
అనంతరం డా॥ శివ జాస్తి మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో ఏఐ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిన్నటి వరకూ కేవలం మన ప్రశ్నలకు సమాధానాలు వెతికే సెర్చ్ ఇంజిన్ లేదా ఒక రైటర్‌గా మాత్రమే ఉండేదని, కానీ ఇప్పుడు మన ప్రాజెక్ట్‌లను పూర్తి చేసే ఒక టీమ్ మెంబర్‌లా మారిందని తెలిపారు. వాహనాలలో కేవలం మ్యాప్ ద్వారా గమ్యాన్ని చూపే దశ నుండి, వాహనాన్ని స్వయంగా నడుపుతూ గమ్యానికి చేర్చే (అటానమస్) దశకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రూపాంతరం చెందిందని ఆయన వివరించారు. విద్యార్థులు కేవలం మంచి ప్రాంప్ట్ రాయడం నేర్చుకుంటే సరిపోదని, ఏఐ ఏజెంట్లను ఎలా నియంత్రించాలి, వాటి సహాయంతో ప్రాజెక్ట్‌లను ఎలా పూర్తి చేయాలి అనే అంశాలను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిఐటియూ రిజిస్ట్రార్ డా॥ వై. మల్లికార్జున రెడ్డి, సిఎస్ఈ విభాగాధిపతి డా॥ వి. రామచంద్రన్ భట్టాచార్య, సిఎస్ఎమ్ విభాగాధిపతి డా॥ జి. సంజయ్ గాంధీ, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన అధికారులు



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** కాకుమాను మండలం పాండ్రపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం మండల స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ డైరెక్టర్ గ్రౌండ్ వాటర్ ఇన్చార్జ్ బి. వందనం, తాసిల్దారు బి. వెంకట స్వామి, ఎంపీడీవో తమలపాకుల. ఉషారాణి , పాఠశాల ను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల యొక్క పాఠ్యపుస్తకములను, నోటు పుస్తకములను పరిశీలించి వారు వ్రాసే విధానాన్ని అభినందించారు. అనంతరం తరగతి గదులను, కంప్యూటర్ ల్యాబ్ ను, స్మార్ట్ టీవీలను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. పాఠశాల యందలి మంచినీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ పనితీరును పరిశీలించి, మంచినీటి యొక్క నాణ్యతను పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించి విద్యార్థులందరూ పరిశుభ్రతను పాటించాలని, ప్లాస్టిక్ రహిత పాఠశాలను అదేవిధంగా ఊరిని ఉంచే విధంగా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి, మెనూ అడిగి తెలుసుకుని విద్యార్థులు అందరితో కలిసి కూర్చొని మధ్యాహ్నం భోజనమును రుచి చూసి భోజనం రుచికరంగా వండారని ప్రశంసించారు. అనంతరం ఉపాధ్యాయులకు తగు సూచనలను అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 1 కెఎఫ్. కెనడీ, ఎంఈఓ 2 కొల్లి. విజయభాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎన్. చిట్టిబాబు శ్రీకాంత్ శర్మ, కెవిఎస్ఎన్. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖలో జీరో వెకెన్సీ ఆయుష్ విభాగానికి అమలు చేయరా?

○ సచివాలయంలోని తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసిన ఆయుష్ పారామెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పత్తి సురేష్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** వైద్య ఆరోగ్య మంత్రి ఆయుష్ విభాగంలో 30 సం లుగా పారామెడికల్ పోస్టులు భర్తీ లేదు. 2021 లోనే సుమారు 1500 పోస్టులు ఖాళీ. ఆంధ్ర ప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖలో జీరో వెకెన్సీ ప్రకారం ప్రభుత్వం పోస్టులు భర్తీ చేస్తున్నారు కానీ ఆయుష్ శాఖలో పూర్తి భిన్నంగా ఉంది. తక్కువ ఖర్చుతో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని భారతీయ సాంప్రదాయ వైద్య విభాగాన్ని బలోపేతం చేయుటకు కేంద్ర ప్రభుత్వం వారు ఆయుష్ శాఖను ఏర్పాటు చేసి కేంద్రంలో ఆయుష్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు.
జాతీయ ఆరోగ్య విధానం -2002, 2017 ప్రకారం ప్రతి ప్రైమరీ హెల్త్ సెంటర్స్ లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ లో ఏరియా హాస్పిటల్స్ లో ఆయుష్ విభాగాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.
అందుకు గాను నేషనల్ ఆయుష్ మిషన్( నామ్ ) నిధులను కేటాయిస్తున్నారు. కానీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్న ఆయుష్ శాఖ పరిస్థితి పూర్తి నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎందుకంటే ప్రైమరీ హెల్త్ సెంటర్స్ లో ఆయుష్ విభాగాలు ఖాళీ , కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ లో ఆయుష్ విభాగాలు ఖాళీ , ఏరియా హాస్పిటల్స్ లో ఆయుష్ విభాగాలు ఖాళీ , మరోప్రక్క 2008 లో ఏర్పాటు చేసిన 457 ఆయుష్ డిస్పెన్సరీలు 2017 సం లో మూసివేశారు.
ఆ 457 డిస్పెన్సర్లలోని 670 ఆయుష్ పారా మెడికల్ సిబ్బందిని రోడ్డున పడేశారు. నేటికి ఆ డిస్పెన్సరీ లను పునరుద్ధరణ చేయలేదు 670 పారా మెడికల్ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోలేదు. కేంద్ర ప్రభుత్వం నామ్ నిధులు యిస్తున్న 457 డిస్పెన్సరీ లు పునరుద్ధరణ లేదు. 30 సం లుగా పారామెడికల్ సిబ్బంది భర్తీ లేదు. జీరో వెకెన్సీ అంటున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆయుష్ లో పోస్టులు భర్తీ చేయడం లేదు.
భారతీయ జనతా పార్టీ నుండి మంత్రి గా సత్య కుమార్ ఉన్నప్పటికీ ఆయుష్ శాఖలో పోస్టులు భర్తీ జరగడం లేదు. మంత్రి సత్యకుమార్ ఆయుష్ శాఖ బలోపేతం చేయుటకు కేంద్రం నుండి భారీగా నిధులు కొరకు విశేషకృషి చేస్తున్నారు కానీ ఆయుష్ శాఖలో పోస్టుల భర్తీ లేక ప్రజలకు ఆయుష్ వైద్య సేవలు అందడం లేదు.

# ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది

○ వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, అభిమానులు

○ పట్టణంలో భారీ ర్యాలీ

○ హాజరైన ఎంపీ లావు,చీఫ్ విప్ జీవీ, ఎమ్మెల్యేలు కన్నా, బ్రహ్మారెడ్డి



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ప్రజా కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పల్నాడు జిల్లా వినుకొండలో గురువారం భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కార్యాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర ర్యాలీకి మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ర్యాలీ వినుకొండ పట్టణంలోని సురేష్ మహల్ రోడ్డు మీదుగా నరసరావుపేట రోడ్డుకు చేరుకుని గంగినేని ఫంక్షన్ హాల్ వరకు సాగింది. అనంతరం గంగినేని ఫంక్షన్ హాల్‌లో భారీ బహిరంగ సభ అత్యంత వైభవంగా నిర్వహించారు.
ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు, అభిమానులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ప్రభుత్వ చీఫ్ విప్ కార్యాలయం నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీ గంగినేని ఫంక్షన్ హాల్ వరకు సాగింది. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొని వైసీపీ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.
ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలన రాష్ట్ర చరిత్రలోనే అత్యంత దుర్మార్గమైన పాలనగా నిలిచిందన్నారు. నాసిరకం బ్రాండ్ల మద్యాన్ని ప్రజలపై బలవంతంగా రుద్ది లక్షలాది కుటుంబాలను నాశనం చేశారని, అమాయకుల ప్రాణాలను బలిగొని జగన్ మోహన్ రెడ్డి వేల కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. "ఒక్క అవకాశం" అంటూ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని రూ. 10 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు. పెన్షన్‌ను ఒకేసారి రూ. 1,000 పెంచుతామని హామీ ఇచ్చి మోసం చేశారని, అమ్మఒడి పథకంలో కూడా ప్రజలను దగా చేశారని విమర్శించారు. అందుకే 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసి గట్టి తీర్పు ఇచ్చారని అన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల ప్రభావాన్ని తెలుసుకోవాలంటే నేరుగా లబ్ధిదారులతో మాట్లాడాలని అన్నారు. దేశంలో ఎక్కడా అమలు కాని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. దీపం, స్త్రీ శక్తి, తల్లికి వందనం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు 45 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లే బాధ్యత నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడు సంవత్సరాల్లో రాష్ట్ర అభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు అమలు చేయనున్నట్లు ఎంపీ తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం క్లస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నామని, కేంద్ర ప్రభుత్వ సబ్సిడీలతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. వినుకొండ నియోజకవర్గంలో ఐదు మహిళా క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డొంక రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ఇప్పటికే 122 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. బొల్లపల్లి ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మాణం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని, నీటి వనరుల అభివృద్ధి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సాగు, తాగునీటి అవసరాలను తీర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి , సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ , ఎమ్మెల్సీ బీటీ నాయుడు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, టీటీడీ పాలక వర్గ సభ్యులు జంగా కృష్ణమూర్తి, కూటమి సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## గుంటూరు జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ విందు సమావేశం



○ హాజరైన మంత్రి నారా లోకేష్, ఇతర ప్రజాప్రతినిధులు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు నివాసంలో గుంటూరు పార్లమెంట్‌కు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధుల ఆత్మీయ విందు సమావేశం జరిగింది. గుంటూరు నగరం గోరంట్లలోని పిల్లి మాణిక్యరావు నివాసంలో జరిగిన ఈ ఆత్మీయ విందు భేటీకి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలన, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సర్ ప్రక్రియ, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై నేతలు చర్చించారు. ఈ సమావేశంలో గుంటూరు ఎంపీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మహ్మద్ నసీర్, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, గుంటూరు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## గుంటూరు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి. దుర్గా ప్రసాద్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జీజీహెచ్) ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి. దుర్గా ప్రసాద్‌ను నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో రేడియేషన్ ఆంకాలజీ విభాగం ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ దుర్గా ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.
జీజీహెచ్ పరిపాలనా వ్యవహారాలు, వైద్య సేవల నిర్వహణను సమర్థవంతంగా కొనసాగించేందుకు ఈ నియామకం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. డాక్టర్ దుర్గా ప్రసాద్ వైద్య రంగంలో ఉన్న అనుభవంతో ఆసుపత్రి సేవలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు

## కోటి దాటిన యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు



○ 13 జిల్లాల్లో వంద శాతం దాటిన రిజిస్ట్రేషన్లు

○ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** యోగాంధ్ర-2026 రిజిస్ట్రేషన్ల లక్ష్యంలో 96.82% వృద్ధి నమోదైంది. 1,04,93,947 లక్ష్యం కాగా గురువారం సాయంత్రం నాటికి 1,01,60,652 రిజిస్ట్రేషన్లు జరిగాయి. 28కి 13 జిల్లాల్లో నూరు శాతానికి మించి రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ మేరకు రాష్ట్రవైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఓ ప్రకటన జారీచేశారు. దీనికిముందు సచివాలయంలో ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఇతర అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఈ నెల 21న నిర్వహించనున్న యోగాసన కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష జరిపారు అధికారులు ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి మంత్రికి నివేదించారు

**2 రోజుల ముందుగానే**

అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూటమి ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాలను ప్రతిష్టాకరంగా తీసుకుని ఈ నెల 7 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 21న రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జరిగే యోగాసన కార్యక్రమాల్లో 1,04,93,947 మందిని భాగస్వాములను చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది.
జిల్లాల్లోని జనభా ప్రాతిపదికన లక్ష్యాన్ని నిర్దేశించారు. దీనికి అనుగుణంగా యోగాంధ్ర పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయి. రిజిస్ట్రేషన్ల నమోదులో జిల్లాల అధికారులు ప్రత్యేక శ్రద్ధకనబరిచారు. రాష్ట్ర స్థాయిలో మంగళగిరిలోని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పడిన వార్ రూం ద్వారా నిత్యం పర్యవేక్షణ కొనసాగుతోంది. ఈ నెల 20వ తేదీనాటికి రిజిస్ట్రేషన్లు ముగియాల్సి ఉంది. అయితే గురువారం నాటికే 1,01,60,652 రిజిస్ట్రేషన్లు జరగడం గమనార్హం.

**విజయనగరం జిల్లా టాప్**

ఈ క్రమంలో విజయనగరం జిల్లాలో 107.57%, చిత్తూరు-104.75%, పశ్చిమ గోదావరి-104.48%, ఏలూరు-104.13%, మార్కాపురం జిల్లాలో 104.09% చొప్పున రిజిస్ట్రేషన్లు జరిగాయి. కాకినాడ, అనకాపల్లి, అనంతపురం, గుంటూరు, నంద్యాల, పార్వతీపురం మన్యం, ప్రకాశం, శ్రీసత్యసాయి, విశాఖ జిల్లాల్లో కూడా రిజిస్ట్రేషన్లు వంద శాతం దాటాయి. అల్లూరి సీతారామరాజులో 99.50%, పోలవరం-98.30%, కర్నూలు-96.22%, శ్రీకాకుళం జిల్లాలో 95.75% చొప్పున రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.
శుక్రవారంనాటికి మరికొన్ని జిల్లాల్లో వంద శాతం వరకు రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మాస్టర్ ట్రైనర్స్ ప్రోగ్రాం కింద 5,600 మందికి శిక్షణ ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్ష్యాన్ని మించి రికార్డు స్థాయిలో 7,754 మంది ట్రైనర్లు పేర్లు నమోదుచేసుకుని, శిక్షణ పొందారు
. మండల స్థాయిలో ట్రైనర్స్ ట్రైనింగ్ కేటగిరిలో ఈ నెల 7 నుంచి జూన్ 11వ తేదీ వరకు 2.5 లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ లక్ష్యాన్ని కూడా అధిగమించి 2,60,381 మందికి శిక్షణ ఇచ్చారు. పోలవరం, మార్కాపురం, పశ్చిమగోదావరి జిల్లాలు ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచాయి.

# తిరుపతిలో జేఎస్ఎస్ క్యాంపస్ ఏర్పాటు

○ జేఎస్ఎస్ మహావిద్యాపీఠంతో ప్రభుత్వం ఒప్పందం

○ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఎంవోయూ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజాప్రభుత్వంలో తిరుపతికి మరో ప్రతిష్టాత్మక విద్యాసంస్థ తరలిరానుంది. మైసూరుకు చెందిన జేఎస్ఎస్ మహావిద్యాపీఠం ఆధ్వర్యంలో తిరుపతిలో జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్-క్యాంపస్ ఏర్పాటుచేయనున్నారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఏపీ ఉన్నత విద్యామండలి జేఎస్ఎస్(జగద్గురు శ్రీ శివరాత్రీశ్వర మహావిద్యాపీఠం) మహావిద్యాపీఠంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఏపీ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేఎస్ఎస్ మహావిద్యాపీఠం టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ ప్రో ఛాన్స్ లర్ డా.బి.సురేష్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం తిరుపతిలో జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్-క్యాంపస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.
మైసూరు హెడ్ క్వార్టర్ గా ఉన్న జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ నాక్ నుంచి A++ గుర్తింపు పొందిన డీమ్డ్ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్‌లో విశ్వవిద్యాలయాల విభాగంలో 21వ స్థానం, ఒవరాల్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ లో 38వ స్థానాన్ని దక్కించుకుంది. 70 ఏళ్ల చరిత్ర కలిగిన జేఎస్ఎస్ విద్యాసంస్థకు ఇది ప్రధాన విద్యాసంస్థగా ఉండగా.. భారత్‌తో పాటు విదేశాల్లో 300కు పైగా విద్యాసంస్థలను నిర్వహిస్తోంది.
**అందుబాటులో 74 కోర్సులు :** ప్రతిపాదిత తిరుపతి క్యాంపస్‌లో ఐదు సమగ్ర విద్యా పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు. అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హెల్త్‌కేర్ అండ్ అలైడ్ సైన్సెస్, మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ టూరిజం, లా, హ్యూమానిటీస్, పాలసీ అండ్ గవర్నెన్స్ ఏర్పాటుచేయనున్నారు. ఈ క్యాంపస్‌లో మొత్తం 74 కోర్సులు అందుబాటులో ఉండనుండగా.. పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత 10 వేల మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది. అదనంగా హెల్త్‌కేర్‌లో ఏఐ, సెమీకండక్టర్ అప్లికేషన్స్, హెల్త్ పాలసీ అండ్ గవర్నెన్స్, పరిపాలన, ట్రాన్స్‌లేషనల్ బయోటెక్నాలజీ, హెల్త్‌కేర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఏరోస్పేస్ మెడిసిన్ వంటి రంగాల్లో ఆరు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నారు. వీటికి తోడుగా విశాఖపట్నం, చెన్నై, బెంగళూరులో పరిశ్రమల అనుసంధాన కేంద్రాలు కూడా నెలకొల్పనున్నారు.
**20వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి కల్పన :** ఈ ఒప్పందం ప్రకారం తిరుపతిలో భూమి కేటాయింపు, అవసరమైన చట్టబద్ధ అనుమతుల కోసం సింగిల్-విండో వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం కల్పించనుంది. క్యాంపస్ అభివృద్ధికి సంబంధించిన మొత్తం వ్యయాన్ని జేఎస్ఎస్ మహావిద్యాపీఠమే భరించడంతో పాటు యూజీసీ నుంచి అవసరమైన అనుమతులను పొందనుంది. అమలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు 60 రోజులలోపు జాయింట్ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. స్వర్ణాంధ్ర విజన్ కు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేలకుపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, పరిశోధకులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ సంస్థ తోడ్పాటును అందించనుంది.
ఈ కార్యక్రమంలో మైసూరు జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ రిజిస్ట్రార్ డా.బి.మంజునాథ, జేఎస్ఎస్ ఏహెచ్ఈఆర్ డీన్(రీసెర్చ్) డా. ప్రశాంత్ ఎమ్ విశ్వనాథ్, కేపీఎంపీ అడ్వైజరీ సర్వీసెస్ అసోసియేట్ డైరెక్టర్ ఎస్.రాఘవన్, స్పెషలిస్ట్ రోమిత్ రావు తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ వ్యవసాయంతో రైతుల ఆదాయం పెంపే లక్ష్యం

○ ప్రతి గ్రామంలో శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు

○ డ్రోన్ సేవలు, యాంత్రీకరణ, నాణ్యమైన విత్తనాలతో వ్యవసాయంలో మార్పులు

○ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతికత, యాంత్రీకరణ, నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా రైతుల ఆదాయం పెంచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో నిర్వహించిన సమీక్ష అనంతరం ఆయన వివరాలు వెల్లడించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులతో కూడిన బృందాలను ఏర్పాటు చేసి శాస్త్రీయ వ్యవసాయ విధానాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. వరి, పత్తి, శనగ, మిర్చి పంటల్లో దిగుబడులు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. గుంటూరు జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో సాగవుతున్న వరికి నాణ్యమైన విత్తనాల ద్వారా దిగుబడులు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామని, 80 వేల ఎకరాలకు సరిపడా విత్తనాల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. పత్తిలో అధిక దిగుబడులు ఇచ్చే కొత్త వంగడాలను విస్తరించడంతో పాటు, ఎన్‌బీజీ-1267 శనగ విత్తనం ద్వారా దిగుబడులు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.
మిర్చి రైతుల వ్యయాన్ని తగ్గించేందుకు యాంత్రీకరణ, ఆధునిక డ్రైయింగ్ సదుపాయాలపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. గ్రీన్ మెన్యూర్ వినియోగాన్ని విస్తరించడం, రైతులకు శాస్త్రీయ సలహాల కోసం ప్రత్యేక యూట్యూబ్ ఛానళ్లను ప్రారంభించడం, వ్యవసాయ యాంత్రీకరణపై మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 230 గ్రామాల నుంచి యువకులను ఎంపిక చేసి డ్రోన్ పైలట్ శిక్షణ అందించి ప్రతి గ్రామంలో వ్యవసాయ అవసరాలకు డ్రోన్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయం, నైపుణ్యాభివృద్ధి, స్వయం సహాయక సంఘాల బలోపేతంపై ప్రతి నెల సమీక్షలు నిర్వహిస్తూ ఫలితాల ఆధారిత పాలన కొనసాగిస్తామని చెప్పారు.

## అభివృద్ధిలో కొత్త శిఖరాలను అధిరోహిస్తున్న కృష్ణా జిల్లా
## మంత్రి వాసంశెట్టి సుభాష్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కృష్ణా జిల్లా అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహకారంతో సంక్షేమం - అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కృష్ణా జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కింద 1.33 లక్షల రైతు కుటుంబాలకు రూ.252.94 కోట్ల పెట్టుబడి సాయం అందించామని తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు 29 కిసాన్ డ్రోన్లను సబ్సిడీపై అందించామన్నారు.
ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. పశు సంవర్ధక రంగంలో ఇంటి వద్దకే పశువైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పరిశ్రమల రంగంలో కృష్ణా జిల్లా విశేష పురోగతి సాధించిందని చెప్పుకొచ్చారు. యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. విద్యారంగంలో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని, మెగా డీఎస్సీ ద్వారా 1,203 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా 1.98 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించామని అన్నారు. ఆరోగ్య రంగంలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రతి నెల 2.30 లక్షల మందికి ప్రయోజనం అందుతోందని వెల్లడించారు.
మహిళా సాధికారత కోసం డ్వాక్రా, స్త్రీనిధి ద్వారా వేల కోట్ల రుణాలు అందించామని మంత్రి తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. 1.27 లక్షలకుపైగా భూ హక్కు పత్రాలను పంపిణీ చేశామని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో కృష్ణా జిల్లా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పేదలకు గృహ వసతి కల్పించడంలో ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందన్నారు. మచిలీపట్నం పోర్టు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనుందని తెలిపారు. పోర్టు, ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టులు పూర్తయితే వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కృష్ణా జిల్లాను పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో కృష్ణా జిల్లా అభివృద్ధిలో కొత్త శిఖరాలను అధిరోహిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

## అమరావతిలో మంత్రుల క్వార్టర్స్ నిర్మాణాల పరిశీలన



○ పనుల పురోగతిని సమీక్షించిన మంత్రి సత్య కుమార్ యాదవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతిలో నిర్మాణంలో ఉన్న మంత్రుల క్వార్టర్స్ భవనాలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రుల క్వార్టర్స్ నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలపై అధికారులు మంత్రికి వివరించారు. భవనాల నిర్మాణ పనులు, మౌలిక వసతుల కల్పన, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులు నిర్ణీత ప్రణాళిక ప్రకారం కొనసాగించాలని, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను పూర్తి చేయాలని మంత్రి అధికారులకు సూచించినట్లు తెలిసింది. రాజధాని ప్రాంత అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ఈ నిర్మాణాలు త్వరగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# దేశాభివృద్ధికి బీజేపీ సుపరిపాలన

○ కేంద్ర పథకాలతో ప్రతి వర్గానికి ప్రయోజనం

○ రాజమహేంద్రవరం పర్యటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

○ కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన, వ్యవసాయ అభివృద్ధిపై చర్చలు





**రాజమహేంద్రవరం, (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ రాజమహేంద్రవరం నగరంలో విస్తృత పర్యటన నిర్వహించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన వ్యవసాయ అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, దేశాభివృద్ధి లక్ష్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.
ఐసీఏఆర్ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ అగ్రికల్చర్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పీవీఎన్ మాధవ్ వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత, పరిశోధనల ప్రాధాన్యత, రైతుల ఆదాయ పెంపు, వాణిజ్య వ్యవసాయ అభివృద్ధి అంశాలపై శాస్త్రవేత్తలు, నిపుణులతో చర్చించారు. రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నాయని తెలిపారు.
అనంతరం కోటగుమ్మం సెంటర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా, పోస్టల్ శాఖ సంయుక్తంగా నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హులైన ప్రజలకు పథకాలపై వివరాలు అందించి నమోదు ప్రక్రియ చేపట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు అన్ని వర్గాలకు చేరుతున్నాయని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రయోజనాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
నగరంలో నిర్వహించిన విశిష్ట వ్యక్తుల సమావేశంలో వికసిత్ భారత్-2047 లక్ష్యంపై చర్చించారు. డిజిటల్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలను వివరించారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, పోస్టల్ శాఖ అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467